


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

01.08.2026
శనివారం |రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 32
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## కావేరీపై భగ్గుమన్న కర్ణాటక

- తమిళనాడు సీఎం విజయ్‌తో డీకే చర్చలు రద్దు
- జలాల విడుదలపై ఆదేశాలు
- బెంగళూరులో ఆదివారం చర్చలు వాయిదా
- విపక్షాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్న డీకే శివకుమార్

2లో..



## పీఎంకిసాన్ పథకాన్ని మరో ఐదేండ్లు పొడిగింపు

- పీఎం-కిసాన్, ఖేలో ఇండియాకు
- భారీ నిధుల కేటాయింపు
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు
- ప్రధాని మోదీ అధ్యక్షతన భేటీ అయిన మంత్రివర్గం
- 'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన'కు ఆమోదం



2లో..

న్యూఢిల్లీ, జులై 31, అనంత జనశక్తి న్యూస్
కేంద్ర మంత్రిమండలి దేశాభివృద్ధికి సంబంధించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతులు, యువత, క్రీడాకారులు, ఇంధన రంగానికి లబ్ధి చేకూర్చే బృహత్తర పథకాలకు పచ్చజెండా ఊపారు. ఈ నిర్ణయాల వివరాలను కేంద్ర సమాచార ప్రసారాల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.

# విదేశీ ఉద్యోగాలకు టామ్‌కాం తోడు

## విదేశీ ఉద్యోగాలకు శిక్షణ: సీఎం రేవంత్

- పాస్‌పోర్టులు టామ్‌కాం ద్వారా
- మ్యాన్‌పవర్ కంపెనీలతో ఒప్పందాలు
- ఏజెంట్ల వివరాలు నమోదు చేయాలి
- డ్రైవింగ్ శిక్షణపై సీఎం ఆదేశాలు
- స్కిల్ యూనివర్సిటీలో విదేశీ భాషలు
- విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు
- ఈవీ, డ్రోన్ కోర్సులు ప్రారంభించాలి



హైదరాబాద్, జులై 31, అనంతజనశక్తి న్యూస్
విదేశాల్లో ఉద్యోగాలకు అవసరమైన శిక్షణ, ఉద్యోగ మేళాలతో పాటు ఉద్యోగార్థులకు అవసరమైన పాస్‌పోర్టు, ఆయా దేశాల్లో వారికి ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యతను టామ్‌కాం తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. శక్తి శాఖపై ఆ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఉత్తర తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు మధ్య ప్రాచ్య దేశాలకు వెళుతుంటారని, ఈ క్రమంలో వారు ఏజెంట్ల చేతిలో మోసపోయి ఇబ్బందిపడుతున్నారని సీఎం తెలిపారు. ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లే వారికి పాస్‌పోర్టులు ఇప్పించడంతో పాటు వారు వెళ్లే దేశాల్లోని మ్యాన్ పవర్ కంపెనీలతో ఒప్పందాలను టామ్‌కాం చేసుకోవాలని సీఎం సూచించారు. విదేశీ కంపెనీలతో టామ్‌కాం ఒప్పందం చేసుకోవడం ద్వారా అక్కడకు వెళ్లిన వారికి ఏవైనా ఇబ్బందులు ఎదురైతే చర్చలు జరపడానికి, వారికి న్యాయం చేయడానికి వీలుంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. కార్మికులను విదేశాలకు తరలించే ఏజెంట్ల వివరాలు సేకరించి.. వారు పంపించే ప్రతి వ్యక్తి వివరాలు నమోదు చేయాలని సీఎం సూచించారు. ఈ వ్యవహారాల పర్యవేక్షణకు టామ్‌కాంకు మాజీ ఐఎఫ్ఎస్ అధికారిని సీఈవోగా నియమిస్తామని సీఎం తెలిపారు. ఉద్యోగార్థులకు లైట్ మోటార్ వెహికల్, హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లోనూ శిక్షణ ఇప్పించాలని సీఎం సూచించారు.




5లో..

## సర్ ముసాయిదా ఓటరు జాబితా విడుదల

- వివరాలను వెల్లడించిన సీఈవో వివేక్ యాదవ్
- 3.71 కోట్ల మంది ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పణ
- మొత్తం ఓటర్లలో 89.22%

2లో..



అమరావతి, జులై 31 అనంత జనశక్తి న్యూస్
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ ముసాయిదా ఓటరు జాబితాను అధికారులు విడుదల చేశారు. ఈ వివరాలను ఏపీ ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) వివేక్ యాదవ్ వెల్లడించారు.

## భోగాపురంలో థింసా నృత్యానికి గిన్నిస్ రికార్డు



2లో..

## అందుబాటులోకి ఫ్యామిలీ సర్టిఫికెట్ సేవ

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటన
- ప్రజలకు కొత్త సౌకర్యాన్ని అందుబాటులోకి
- పూర్తి వివరాలతో కూడిన ఫ్యామిలీ ధ్రువపత్రాలు
- తహశీల్దార్ కార్యాలయాలు, మీ సేవా కేంద్రాల ద్వారా

2లో..



హైదరాబాద్, జులై 31, అనంతజనశక్తి న్యూస్
తెలంగాణ ప్రజలకు ప్రభుత్వం కొత్త సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియ ప్రారంభమైందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇకపై కుటుంబ సభ్యుల సమాచారం..

## డీఏపీ ఎరువుల సరఫరా పెంచండి

- కేంద్రానికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి
- ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలి



2లో..

హైదరాబాద్, జులై 31, అనంత జనశక్తి న్యూస్
రాష్ట్రానికి డీఏపీ ఎరువుల సరఫరాను పెంచాలని కేంద్రానికి తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఖరీఫ్‌లో రైతులకు డీఏపీ ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన్ని మంత్రి తుమ్మల కోరారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాకు ఆయన లేఖ రాశారు. ఆగస్టుకు 50 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ కేటాయించాలని కేంద్రాన్ని ఆయన డిమాండ్ చేశారు.

## విడిపోయిన సీఎం దంపతులు

- 17 ఏళ్ల సంసారానికి ముగింపు!
- ఒమర్ అబ్దుల్లా - పాయల్ విడాకులు మంజూరు
- సీఎం వ్యక్తిగత జీవితంలో కీలక మలుపు

2లో..



## 2029లో వైసీపీదే అధికారం భారీ మెజారిటీతో గెలుస్తాం

- వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి
- సంస్థాగతంగా బలోపేతం చేశాం
- భవిష్యత్ ఎన్నికల్లో ఇది పార్టీకి మరింత బలం



5లో..

అమరావతి, జులై 31, అనంతజనశక్తి న్యూస్
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలకు కీలక దిశానిర్దేశం చేశారు. సోషల్ మీడియా విభాగాన్ని గ్రామస్థాయి వరకు సంస్థాగతంగా బలోపేతం చేశామని, భవిష్యత్ ఎన్నికల్లో ఇది పార్టీకి మరింత బలంగా ఉపయోగపడుతుందని అన్నారు. పార్టీ సిద్ధాంతాలు, జగన్ సందేశాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వైసీపీకి అధికారమే లక్ష్యం కాదని, ప్రజల సంక్షేమమే పార్టీ ప్రధాన అజెండా అని సజ్జల స్పష్టం చేశారు.

## ఫార్ములా ఈకార్ కేసులో నాంపల్లి కోర్టుకు కేటీఆర్

- విచారణ ఆగస్టు 25కి వాయిదా!
- కేటీఆర్, ఐఏఎస్ అర్వింద్ కుమార్‌ల విచారణ
- నిబంధనలు ఉల్లంఘించి రూ.55 కోట్లు బదిలీ!
- ఏసీబీ అధికారుల ఆరోపణలు

5లో..



హైదరాబాద్, జులై 31, అనంతశక్తి న్యూస్
రాష్ట్రంలో తీవ్ర రాజకీయ దుమారం రేపిన ఫార్ములా ఈకార్ రేసు కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారానికి సంబంధించిన కేసులో తదుపరి విచారణను నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టు ఆగస్టు 25వ తేదీకి వాయిదా వేసింది. శుక్రవారం ఉదయం జరిగిన ఈ విచారణకు కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)తో పాటు ఇతర నిందితులు స్వయంగా హాజరయ్యారు.

## ధర్మేంద్ర రాజీనామా సాధ్యమయ్యేదే కాదు

- వాంగ్‌చుక్ దీక్షతోనే బలం
- కాక్రోచ్ జనతాపార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్
- మా మధ్య విభేదాల్లేవని కామెంట్

5లో..





# డీఏపీ ఎరువుల సరఫరా పెంచండి

(మొదటిపేజీ తరువాయి)

సెప్టెంబర్‌లో మరో 50 వేల మెట్రిక్ టన్నులు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో 50 శాతం వరి నాట్లు పూర్తయ్యాయని ఆ లేఖలో మంత్రి తుమ్మల వివరించారు. డీఏపీ ఎరువుల డిమాండ్ భారీగా పెరుగుతోందని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ నిల్వ మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరగడంతో డీఏపీ ఎరువుల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారని చెప్పారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా సహకరించాలని కేంద్రానికి ఈ సందర్భంగా మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

## అందుబాటులోకి

# ఫ్యామిలీ సర్టిఫికెట్ సేవ



(మొదటిపేజీ తరువాయి)

వారి పూర్తి వివరాలతో కూడిన ఫ్యామిలీ ధ్రువపత్రాలను తహశీల్దార్ కార్యాలయాలు, మీ సేవా కేంద్రాల ద్వారా పొందవచ్చని తెలిపారు. కుటుంబ వివరాలను అధికారికంగా ధ్రువీకరించుకునేందుకు ఈ సర్టిఫికెట్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ కుటుంబ సమాచారానికి సంబంధించి అవసరమైన సందర్భాల్లో ఈ ధ్రువపత్రాన్ని వినియోగించుకోవచ్చని చెప్పారు.

ఫ్యామిలీ సర్టిఫికెట్ అన్ని చోట్ల చెల్లుబాటు అవుతుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు, వివిధ అధికారిక అవసరాలు, కుటుంబ వివరాలను సమర్పించాల్సిన సందర్భాల్లో ఈ ధ్రువపత్రం కీలకంగా మారనుందని తెలిపారు. ఇప్పటివరకు కుటుంబ వివరాల ధ్రువీకరణ కోసం ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించడంతో పాటు, ప్రజలకు సులభంగా సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రక్రియను ప్రారంభించినట్లు వెల్లడించారు. తహశీల్దార్ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

# భోగాపురంలో థింసా నృత్యానికి గిన్నిస్ రికార్డు

**భోగాపురం, జులై 31, అనంత జనశక్తి న్యూస్**

భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన థింసా నృత్యం గిన్నిస్ రికార్డు సృష్టించింది. 16 వేల మంది ఆదివాసీ బాలికలతో థింసా నృత్యాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. థింసా నృత్యంలో మంత్రి సంధ్యారాణి పాల్గొన్నారు. గిన్నిస్ అవార్డును మంత్రి అందుకున్నారు. శనివారం భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఆదివాసీలు అపూర్వ స్వాగతం పలకనున్నారు. గత మూడు రోజులుగా ఆదివాసీ విద్యార్థినులు రిహార్సల్స్ చేస్తున్న విషయం తెలిసిందే. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఆదివాసీ విద్యార్థినులు తరలివచ్చి ఈ థింసా నృత్యంలో పాల్గొన్నారు.

**అంగరంగ వైభవంగా ఏర్పాట్లు..**

భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఘన స్వాగతం చెప్పేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సంప్రదాయ థింసా నృత్యంతో రేపు (శనివారం) 16 వేల మంది మంది ఆదివాసీ బాలికలు ప్రధానికి స్వాగతం పలకనున్నారు. ఆంధ్రప్రదేశ్ సంస్కృతి సంప్రదాయాలు, కళలు ఉట్టిపడేలా అల్లూరి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అధికారులు అలంకరించారు.

ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు..

విమానాశ్రయ స్వాగత ద్వారం వద్ద ఆకట్టుకునేలా భారీ స్థాయిలో ఏటికొప్పాక కళాకృతిలో అలంకరించారు. విమానాశ్రయం లోపల ప్రాంగణంలో ఏపీ చారిత్రక వైభవం చాటేలా తోలు బొమ్మలాట, బొబ్బిలి వీణ, భౌగోళిక వారసత్వం చాటిచెప్పేలా బంగినపల్లి మామిడి లాంటి చిత్రాలతో అలంకరించారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇవాళ (శుక్రవారం) సాయంత్రం విశాఖపట్నం బీచ్ రోడ్డులో డ్రోన్ షో కనువిందు చేయనుంది. ఇప్పటికే అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విమాన సర్వీసుల నిర్వహణ కోసం ఎయిర్ ఇండియా షెడ్యూల్ ప్రకటించిన విషయం తెలిసిందే.





# కావేరీపై భగ్గుమన్న కర్ణాటక

**బెంగళూరు, జులై 31, అనంతజనశక్తి న్యూస్**



తమిళనాడు, కర్ణాటకల మధ్య మరోసారి కావేరీ జల వివాదం మంటలు రేపుతోంది. తమిళనాడుకు 15 రోజుల పాటు రోజుకు 3,500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేయాలని కర్ణాటకను కావేరీ వాటర్ రెగ్యులేటరీ అథారిటీ ఆదేశించింది. దీంతో కన్నడిగుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ క్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ఆగస్టు 3న జరగాల్సిన చర్చలను వాయిదావేస్తున్నట్టు కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ప్రకటించారు. ప్రస్తుత ఉద్రిక్తతల దృష్ట్యా విజయ్ తన పర్యటనను రద్దుచేసుకోవాలని డీకే కోరారు. సందర్భం వచ్చినప్పుడు మనం కలుసుకోవచ్చని ఆయన అన్నారు.

అలాగే, విపక్షాలతో చర్చించిన తర్వాతే కావేరీ జలాల విడుదలపై నిర్ణయం తీసుకుంటామని డీకే స్పష్టం చేశారు. బంద్ నిర్ణయాన్ని ప్రతిపక్షాలు విరమించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గత మూడేళ్లుగా కర్ణాటకలో వర్షాలు సమృద్ధిగా కురువడంతో నీటి కేటాయింపులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పోయిందని, తమిళనాడుకు తన వాటా కంటే ఎక్కువ నీటిని విడుదల చేయగలిగిందని సీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు. ''తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌తో చర్చలకు రాష్ట్ర ప్రభుత్వం మొదట సిద్ధమైనప్పటికీ, క్యాబినెట్ సహచరులు, న్యాయ బృందంతో సంప్రదింపులు జరిపిన తర్వాత, ప్రశాంతమైన వాతావరణంలో భేటీ జరిగేలా చూసేందుకు ఈ సమావేశాన్ని వాయిదా వేయాలని నిర్ణయించాం'' శివకుమార్ తెలిపారు.

''ఈ సమయంలో వాతావరణం అనుకూలంగా లేదని నేను భావిస్తున్నాను.. చాలా సౌహార్ద్రపూర్వక వాతావరణం ఉండాలి కాబట్టి, ఈ పర్యటనను కొద్దికాలం వాయిదా వేసుకోవాలని నేను ఆయనను (విజయ్‌ను) కోరుతున్నాను. రెండు రాష్ట్రాలూ దీనివల్ల ప్రయోజనం పొందాలని నేను కోరుకుంటున్నాను.. మా ఇద్దరి మధ్య ఎలాంటి కలతలు ఉండకూడదని నేను భావిస్తున్నాను... ఇదంతా వరుణ దేవుని కృపపైనే ఆధారపడి ఉంది'' అని ఆయన పేర్కొన్నారు.

మరోవైపు, సీడబ్ల్యూఆర్ఏ ఆదేశాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. కన్నడిగులు ఆందోళనలు చేపట్టారు. దీని ప్రభావం ఇటీవల విడుదలైన విజయ్ సినిమా 'జననాయగన్'పై పడింది. కర్ణాటక వ్యాప్తంగా ఆ ఆ సినిమా ప్రదర్శన నిలిచిపోయింది. ముందుజాగ్రత్త చర్యగా పలు థియేటర్లు విజయ్ పోస్టర్లు, కటౌట్లను తొలగించి.. ప్రదర్శనలను స్వచ్ఛందంగా నిలిపివేశాయి. ఇదిలా ఉండగా, 15 రోజుల పాటు రోజుకు 7,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కావేరీ జల నియంత్రణ కమిటీని తమిళనాడు ప్రభుత్వం కోరగా.. ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. రోజుకు 3,500 క్యూసెక్కులకు అంగీకరించింది. దీనిపై కర్ణాటక ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేస్తూ కావేరీ జల నిర్వహణ అథారిటీని ఆశ్రయించగా.. సీడబ్ల్యూఆర్ఏ నిర్ణయాన్ని అది సమర్థించింది.

# పీఎంకిసాన్ పథకాన్ని మరో ఐదేండ్లు పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)




రైతులకు సాగు ఖర్చుల కోసం నేరుగా ఆర్థిక సహాయం అందించే 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' (పీఎంకిసాన్) పథకాన్ని 203031 ఆర్థిక సంవత్సరం వరకు పొడిగించారు. ఈ ఐదేళ్ల కాలానికి గాను రూ. 3,15,614 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించారు. 2019 ఫిబ్రవరి 24న ప్రారంభమైన ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ. 6,000 చొప్పున ఆర్థిక సాయం అందుతోంది. ఈ మొత్తాన్ని రూ. 2,000 చొప్పున మూడు సమాన విడతల్లో నేరుగా లబ్ధిదారుల ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాల్లోకే జమ చేస్తున్నారు. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా ఉన్న కోట్ల మంది రైతు కుటుంబాలకు రాబోయే ఐదేళ్ల పాటు నిరంతర ఆర్థిక భరోసా లభించనుంది.

**క్రీడారంగానికి రూ. 36,441 కోట్లు.. 'ఖేలో ఇండియా' విస్తరణ**

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక క్రీడాభివృద్ధి కార్యక్రమంగా రూపుదిద్దుకున్న 'ఖేలో ఇండియా' విస్తరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఖేలో ఇండియా పథకంతో పాటు జాతీయ క్రీడా సమాఖ్యలకు అందించే సహాయాన్ని కలిపి మొత్తం రూ. 36,441 కోట్లు కేటాయించారు.

ఇందులో ఖేలో ఇండియా పథకానికి రాబోయే ఐదేళ్లకు గాను రూ. 29,054 కోట్లు కేటాయించారు. ఇది మునుపటి బడ్జెట్ కంటే దాదాపు ఎనిమిది రెట్లు ఎక్కువ. 2030 కామన్వెల్త్ గేమ్స్ నిర్వహణ, 2036 ఒలింపిక్స్ వేలం దిశగా అడుగులు వేస్తున్న భారత్, క్రీడల్లో ప్రపంచ శక్తిగా ఎదిగేందుకు ఈ నిధులు తోడ్పడనున్నాయి. అలాగే జాతీయ క్రీడా సమాఖ్యలకు ఐదేళ్ల వ్యవధిలో రూ. 7,387 కోట్ల సాయం అందించనున్నారు.

పాఠశాల స్థాయి నుంచే క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు రెండు కొత్త కార్యక్రమాలను ప్రారంభించారు:

**ఖేలో ఇండియా ఫీడర్ స్కూల్స్**

ఖేలో ఇండియా ఉత్కృష్ట విద్యాలయాలు

ఈ విధానం ద్వారా సాధారణ విద్యతో పాటు క్రీడలను అనుసంధానించి చిన్ననాటి నుంచే ప్రతిభను గుర్తించి శిక్షణ ఇస్తారు. మహిళా అథ్లెట్లు, పారా అథ్లెట్లు, దేశీయ సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ క్రీడాకారుల సమాచారం, మౌలిక వసతులు, పోటీల వివరాల కోసం ఒక డిజిటల్ స్పోర్ట్స్ ప్లాట్‌ఫామ్‌ను కూడా అందుబాటులోకి తేనున్నారు.

'సముద్ర మంథన్'తో ఇంధన రంగంలో విప్లవం

దేశీయంగా చమురు, సహజ వాయువు ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'సముద్ర మంథన్' (నేషనల్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప్లోరేషన్ స్కీమ్) ప్రారంభానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. 203031 ఆర్థిక సంవత్సరం వరకు అమలు కానున్న ఈ పథకానికి రూ. 84,084 కోట్లు కేటాయించారు.

ఈ పథకం ద్వారా సముద్ర తీర ప్రాంతాల్లో చమురు, గ్యాస్ నిల్వల అన్వేషణను వేగవంతం చేస్తారు. 600 మిలియన్ మెట్రిక్ టన్నుల ఆయిల్ ఈక్వివలెంట్ కంటే ఎక్కువ నిల్వలను కనుగొనాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనివల్ల దిగుమతులపై ఆధారపడటం తగ్గడమే కాకుండా ఇంధన రంగంలో భారీగా కొత్త ఉద్యోగాలు, పెట్టుబడులు తరలివచ్చే అవకాశముంది.

నీటిపై తేలియాడే సౌర విద్యుత్ ప్లాంట్లు: రూ.5,070 కోట్లతో 'పీఎం సూర్య సరోవర్ యోజన'కు కేబినెట్ ఆమోదం

పునరుత్పాదక ఇంధన రంగాన్ని విస్తరించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన' పథకానికి ఆమోదం తెలిపింది. రూ.5,070 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ పథకం ద్వారా నీటిపై తేలియాడే (ఫ్లోటింగ్) సోలార్ ప్లాంట్ల సాయంతో 5,000 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రాజెక్టుల వద్దే విద్యుత్‌ను నిల్వ చేసే వ్యవస్థలను కూడా అనుసంధానించనున్నారు.

ఈ పథకం కింద కనీసం రెండు గంటల పాటు విద్యుత్‌ను నిల్వ ఉంచేలా సామర్థ్యాన్ని అందుబాటులోకి తెస్తారు. 202627 నుంచి 203031 ఆర్థిక సంవత్సరాల మధ్య ఈ ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయనుండగా, 203233 వరకు కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందుతుంది. ప్రస్తుతం దేశంలో తేలియాడే సోలార్ ప్లాంట్ల సామర్థ్యం కేవలం 700 మెగావాట్లు మాత్రమే ఉండగా, ప్రాజెక్టులు, జలాశయాల్లో దాదాపు 102.18 గిగావాట్ల మేర విద్యుత్ ఉత్పత్తికి అవకాశాలున్నాయని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీ స్పష్టం చేసింది.

కేంద్ర సాయం వివరాలు:

తయారీ సాయం: ప్రాజెక్ట్ విజయవంతంగా ప్రారంభమైన తర్వాత ప్రతి మెగావాట్‌కు రూ.1 కోటి చొప్పున కేంద్రీయ ఆర్థిక సాయం లభిస్తుంది.


ప్రాథమిక అధ్యయనాలు: పర్యావరణ, హైడ్రోగ్రాఫిక్ తదితర ముందస్తు అధ్యయనాల కోసం ఒక్కో ప్రాజెక్టుకు గరిష్టంగా రూ.50 లక్షల వరకు అందిస్తారు.

ఈ ప్రాజెక్టుల వల్ల సౌర ప్లాంట్ల కోసం ప్రత్యేకంగా భూమి సేకరించాల్సిన అవసరం ఉండదు. ప్లాంట్ల ఏర్పాటు వల్ల ఏటా దాదాపు 1 కోటి టన్నుల కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని, దేశీయంగా తయారీ రంగానికి ఊతం లభించడమే కాకుండా 16,000 నుంచి 17,000 మందికి కొత్తగా ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ పథకం అందుబాటులోకి రానుంది.

# సర్ ముసాయిదా ఓటరు జాబితా విడుదల

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా 3.71 కోట్ల మంది తమ ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించినట్లు వివేక్ యాదవ్ తెలిపారు. మొత్తం 4.16 కోట్ల మంది ఓటర్లలో 89.22 శాతం మంది ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించినట్లు తెలిపారు. ఓటరు జాబితాలోని 15.22 లక్షల మందిని మృతులుగా గుర్తించినట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలోని 22.30 లక్షల మంది ఓటర్లు ఎస్ఐఆర్ ప్రక్రియకు గైర్హాజరు కావడమో.. శాశ్వతంగా నివాసాలు మారడమో జరిగినట్లు తెలిపారు. అలాగే 7.37 లక్షల మంది రెండు, మూడు చోట్ల ఓటర్లుగా నమోదైనట్లు ఏపీ ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ తెలిపారు. మరోవైపు ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాలలో ఓటు ఉన్నవారి పేరును ఒకేచోట కొనసాగించామని వివేక్ యాదవ్ తెలిపారు. ఫారం 6తో నిజమైన ఓటర్లు మరోసారి నమోదు చేసుకునే వీలుందని వెల్లడించారు. ముసాయిదా ఓటరు జాబితాపై నేటి నుంచి (జులై 31) ఆగస్ట్ 30వ తేదీ వరకూ అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. వీటిని పరిశీలించిన అనంతరం.. అక్టోబర్ 3న తుది ఓటరు జాబితా ప్రకటించనున్నట్లు ఏపీ ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ వివరించారు. మరోవైపు నోటీసు, విచారణ లేకుండా ఓటర్ జాబితాలో నుంచి ఎవరి పేరును కూడా తొలగించబోమని అధికారులు స్పష్టం చేశారు. మరోవైపు ఇక్కడ క్లిక్ చేసి.. ఎస్ఐఆర్ ముసాయిదా ఓటరు జాబితాలో మీ పేరు ఉందో లేదో.. చెక్ చేసుకునే అవకాశం ఉంది. ఇక్కడ మీ జిల్లాను. నియోజకవర్గాన్ని, అలాగే ఇంగ్లీష్, తెలుగు భాషలలో ఏదో ఒకదానిని ఎంపిక చేసిన అనంతరం.. కింద ఇచ్చిన కాప్చా నమోదు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత మీ పోలింగ్ బూత్ నెంబర్ నమోదు చేసి ఎస్ఐఆర్ ముసాయిదా ఓటరు జాబితాను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. అందులో మీ పేరు ఉందో, లేదో తెలుసుకునే అవకాశం ఉంది.



# విడిపోయిన సీఎం దంపతులు

**శ్రీనగర్, జులై 31, అనంత జనశక్తి న్యూస్**



జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఆయన భార్య పాయల్ అబ్దుల్లా దాంపత్య బంధానికి అధికారికంగా ముగింపు పలికింది. దాదాపు 17 ఏళ్లుగా విడిగా జీవిస్తున్న ఈ దంపతులు పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకోగా, వారి అభ్యర్థనకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపింది. అలాగే ఒకరిపై ఒకరు దాఖలు చేసుకున్న అన్ని న్యాయపరమైన కేసులను ఉపసంహరించుకోవడానికి కూడా ఇరు పక్షాలు అంగీకరించాయి. ఈ కేసును జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ అలోక్ అరధే ధర్మాసనం విచారించింది. విచారణ సందర్భంగా ఇరు పక్షాల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, ఒమర్ అబ్దుల్లా - పాయల్ తమ మధ్య ఉన్న అన్ని విభేదాలను పరిష్కరించుకున్నారని కోర్టుకు తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద పరస్పర అంగీకారంతో వివాహ బంధాన్ని రద్దు చేయాలని కోరుతూ జూలై 22న సంయుక్త పిటిషన్ దాఖలు చేసినట్లు వివరించారు. ఒప్పందంలోని నిబంధనల ప్రకారం తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని ధర్మాసనం పేర్కొంది.

ఒమర్ అబ్దుల్లా, పాయల్ 1994లో వివాహం చేసుకున్నారు. ఢిల్లీలోని ఒబెరాయ్ హోటల్‌లో పనిచేస్తున్న సమయంలో ఇద్దరికీ పరిచయం ఏర్పడి, ఆ తర్వాత వివాహ బంధంతో ఒక్కటయ్యారు. వీరికి జహీర్, జమీర్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే 2009 నుంచే ఇద్దరూ విడిగా నివసించడం ప్రారంభించగా, 2011లో తమ దాంపత్య జీవితం ముగిసిందని ఒమర్ అబ్దుల్లా బహిరంగంగా ప్రకటించారు. విడాకుల కోసం ఒమర్ అబ్దుల్లా ముందుగా ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించినప్పటికీ, 2016లో ఆ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. అనంతరం ఆయన ఢిల్లీ హైకోర్టులో అప్పీల్ చేశారు. 2023 డిసెంబర్‌లో హైకోర్టు కూడా ఫ్యామిలీ కోర్టు తీర్పును సమర్థిస్తూ, పాయల్‌కు నెలకు రూ.1.5 లక్షల భరణం, కుమారుడి విద్య కోసం అదనంగా నెలకు రూ.60 వేల చెల్లించాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వును సుప్రీంకోర్టులో సవాలు చేసిన ఒమర్ అబ్దుల్లా కేసు మధ్యవర్తిత్వానికి వెళ్లింది. అక్కడ ఇరు పక్షాలు పరస్పర అవగాహనకు వచ్చి, అన్ని వివాదాలకు ముగింపు పలకడంతో సుప్రీంకోర్టు వారి విడాకులకు అధికారికంగా ఆమోదం తెలిపింది.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం


# అయోధ్య విరాళాల చోరీపై స్కిట్.. అతిథి పాత్రలో రాహుల్ గాంధీ




దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైన అయోధ్య రామాలయం విరాళాల చోరీ విషయంలో విపక్షాలు ఆందోళనలను తీవ్రం చేస్తున్నాయి. ఈ నిరసనల్లో భాగంగానే స్వతంత్ర ఎంపీ రాజేశ్ రంజన్ (పప్పు యాదవ్) పార్లమెంట్ ఆవరణలో వినూత్న స్కిట్ ప్రదర్శించారు. కాషాయ వస్త్రాలు ధరించి, ఓ సన్యాసి వేషంలో వచ్చిన ఆయన.. పార్లమెంట్ పరిసరాల్లో కూర్చొని విరాళాలు సేకరించారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు రుచి వీరా (మోరదాబాద్), అవధేశ్ ప్రసాద్ (అయోధ్య) కూడా ఈ స్కిట్‌లో నటించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అతిథి పాత్రలో కనిపించారు. ఆయన కొంత మొత్తాన్ని హుండీలో వేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ కూడా తమ వంతుగా విరాళాలు ఇచ్చారు. అలా పలువురు ఎంపీలు ఇచ్చిన విరాళాలతో ఆ సన్యాసి ఉడాయిస్తాడు. అది గమనించిన ఎంపీలు అతడిని పట్టుకొన్ని దేహశుద్ధి చేసినట్లు నటిస్తారు. అక్కడితో స్కిట్ ముగుస్తుంది.

దీనిపై సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ మాట్లాడుతూ..“ ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ జరిగింది. దీనిపై చర్చ చేపట్టాలని విపక్షాలు డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. ఇన్నాళ్లూ నీట్ పేపర్ లీక్ అంశంపై ఉభయసభల్లోనూ ఆందోళనలు రేగడంతో ఈ విషయం చర్చకు రాలేదు. దీనిపై చర్చ చేపట్టాలని నేను కూడా పార్లమెంట్ ప్రారంభమైన రోజు నుంచి నోటీసులు ఇస్తూనే ఉన్నాను. కానీ, ప్రభుత్వం నుంచి స్పందన లేదు. అందుకే, పప్పు యాదవ్ ఆలోచనతో ఈ స్కిట్ చేశాం” అని అన్నారు. లోక్‌సభలో పప్పు యాదవ్ కాషాయ వస్త్రధారణ అందరి దృష్టిని ఆకర్షించింది. దీనిపై స్పీకర్ ఓం బిర్లా ఒకింత అసహనం వ్యక్తం చేశారు. సభకు ఇలా రావడం సరికాదన్నారు. ఆయన పేరు ప్రస్తావించకుండానే ‘సభకు విభిన్న వేషధారణలతో వచ్చే సభ్యులకు..’ అంటూ మందలించారు.

# కావేరీ జలాల వివాదం: కన్నడనాట విజయ్ ‘జననాయగన్’పై ఎఫెక్ట్



తమిళనాడు, కర్ణాటక మధ్య కావేరీ జలాల వివాదం తీవ్రరూపం దాల్చుతోంది. కావేరీ నదీ జలాల నియంత్రణ కమిషన్ . కర్ణాటక నుంచి తమిళనాడుకు 4 టీఎంసీల నీటిని విడుదల చేయాలంటూ ఆదేశాలు ఇచ్చింది. ఈ ఆదేశాలపై కన్నడిగులు భగ్గుమంటున్నారు. ఈ ప్రభావం తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ‘జననాయగన్’ సినిమాపై పడింది. కర్ణాటక వ్యాప్తంగా ఆ సినిమా స్క్రీనింగ్‌ను నిలిపివేశారు. ముందుజాగ్రత్త చర్యగా రాష్ట్రంలోని అనేక థియేటర్లు విజయ్ పోస్టర్లను తొలగించి.. సినిమా ప్రదర్శనలను స్వచ్ఛందంగా నిలిపి వేశాయి.

కావేరి పరీవాహకంలో చుక్క నీటి కోసం రైతులు పరితపిస్తుండగా సీడబ్ల్యూఆర్సీ ఇచ్చిన ఆదేశాన్ని గురువారం కావేరి జల నిర్వహణ సంస్థ (సీడబ్ల్యూఎంఏ) కూడా సమర్థించడంతో కర్ణాటకవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. రైతు సంఘాలతోపాటు రాజకీయ పార్టీలు, చలనచిత్ర పరిశ్రమ, కన్నడ సంఘాలన్నీ ఒక్కటై ఆందోళన చేస్తున్నాయి. అంతేగాకుండా విజయ్ చిత్రం ‘జననాయగన్’ ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ.. సినిమా థియేటర్ల వద్ద పోస్టర్లు చింపి నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆగ్రహ జ్వాలల నేపథ్యంలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఉండేందుకు థియేటర్ల యాజమాన్యాలు స్వచ్ఛందంగా ఈ సినిమా స్క్రీనింగ్‌ను నిలిపివేశాయి. విజయ్ నటించిన చివరి సినిమా ‘జననాయగన్’కు ఆది నుంచి ఆటంకాలే ఎదురయ్యాయి. ఈ ఏడాది సంక్రాంతికే థియేటర్లలో విడుదల కావాల్సిన ఈ చిత్రం సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. చివరకు జులై 23న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కర్ణాటకలో 125 నుంచి 150 థియేటర్లలో విడుదలైంది. తాజా నిరసనల నేపథ్యంలో.. ఈ చిత్రం స్థానంలో ‘కరావళి’ మూవీ షోలు వేశారు.

**విజయ్‌డీకే భేటీ వాయిదా**

ఆగస్టు 2న కావేరి సమస్యపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తామని కర్ణాటక ముఖ్యమంత్రి శివకుమార్ దిల్లీలో ప్రకటించారు. సీడబ్ల్యూఎంఏ ఆదేశాలకు వ్యతిరేకంగా కర్ణాటక ప్రభుత్వం అప్పీల్ చేస్తుందని వెల్లడించారు. దీనిపై తమిళనాడు ప్రభుత్వం నుంచి స్పందన వచ్చింది. కావేరీ జలాల్లో తమ వాటాను పొందేందుకు సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ఆ రాష్ట్ర న్యాయశాఖ మంత్రి సీటీఆర్ నిర్మల్ కుమార్ పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆగస్టు 3న విజయ్‌తో జరగాల్సిన సమావేశాన్ని వాయిదా వేసుకున్నట్లు డీకే వెల్లడించారు.

# కూలిన నాలుగంతస్తుల భవనం.. 8 మంది మృతి



మహారాష్ట్ర లోని భివండీలో నాలుగంతస్తుల భవనం కూలింది . ఈ ఘటనలో 8 మంది మృతిచెందగా.. శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారు. ప్రమాదం జరిగిన భవనంలో ఒక్కో అంతస్తులో 12 చొప్పున మొత్తం 48 గదులు ఉన్నాయి. గురువారం రాత్రి 11:30 గంటల సమయంలో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరగడంతో .. అందులోని వారంతా శిథిలాల కింద చిక్కుకున్నట్లు పోలీసులు తెలిపారు. వెంటనే స్పందించిన స్థానికులు పలువురిని రక్షించారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

పదేళ్ల క్రితం నిర్మించిన ఈ భవనంలో పగుళ్లు ఏర్పడడంతో.. దానిని ఖాళీ చేయాల్సిందిగా అక్కడి వారికి ఇది వరకే సూచించినట్లు మున్సిపల్ అధికారులు వెల్లడించారు. అయినప్పటికీ వారు ఖాళీ చేయకుండా అనధికారికంగా మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. మృతుల్లో ఎక్కువ మంది మరమ్మతు పనులు చేస్తున్న కార్మికులేనని చెప్పారు.

# ఒంటినిండా రక్తంతో నాన్నను ఇంటికి తీసుకొచ్చారు.. దిల్లీ పోలీసు కుమార్తె ఆవేదన



దేశ రాజధాని దిల్లీలో జరిగిన విద్యార్థుల ఆందోళనల సమయంలో ఎంతో మంది పోలీసులు గాయపడినా.. వారి గురించి ప్రజలకు పట్టట్లేదని ఆయా కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. ఈ నిరసనల్లో గాయపడిన కొంతమంది పోలీసుల కుటుంబసభ్యులు శుక్రవారం మీడియా ముందుకొచ్చారు. నాటి సంఘటనలను గుర్తుచేసుకుంటూ తమకు కూడా న్యాయం జరగాలని డిమాండ్ చేశారు.

**నాన్నను లాగి.. మూకదాడికి యత్నం**

‘‘నేను దిల్లీ యూనివర్సిటీలో చదువుతున్నా. మా నాన్న 15 ఏళ్ల పాటు నేవీలో మెరైన్ కమాండోగా సేవలందించారు. ఇప్పుడు దిల్లీ పోలీసు విభాగంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. విద్యార్థుల ఆందోళనల సమయంలో నాన్న ప్రధాన వేదిక అయిన జంతర్ మంతర్ వద్ద విధులు నిర్వహించారు. ప్రతి రాత్రి ఇంటికి వచ్చిన తర్వాత.. నిరసనల గురించి మాకు చెప్పేవారు. విద్యార్థుల ముసుగులో కొంతమంది సంఘ విద్రోహ శక్తులు ఆందోళనల్లో చేరారని అన్నారు. ఆందోళనల సమయంలో మా నాన్నను కొంతమంది లాగి.. మూక దాడికి యత్నించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను ఆసుపత్రికి తరలించారు. దాదాపు నాలుగు గంటల పాటు నాన్న స్పృహలో లేరు. ఇంటికి తీసుకొచ్చేటప్పుడు ఆయన యూనిఫామ్ అంతా రక్తంతో తడిసిపోయింది. అలాంటి రోజు మా జీవితంలో ఎన్నడూ చూడలేదు. ఈ ఘటన తర్వాత నేను సోషల్ మీడియా తెరవగా.. మా నాన్ననే నేరస్థుడిగా నిందిస్తున్నారు. ఆయనపై దాడి చేసిన వారే.. న్యాయం కావాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అప్పుడే నిర్ణయించుకున్నా.. మాకూ న్యాయం జరగాల్సిందే. అందుకే గాయపడిన పోలీసుల కుటుంబాలతో కలిసి సుప్రీంలో పిటిషన్ వేశాం’’ అని ఓ ఎస్సై కుమార్తె మీడియా ముందు తన ఆవేదనను పంచుకున్నారు.

**రాళ్ల దాడికి.. హెల్మెట్ విరిగి..**

‘‘నా భర్త దిల్లీ పోలీసు విభాగంలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్. 33 ఏళ్లుగా పోలీసు శాఖలో ఉన్నారు. ఆందోళనల సమయంలో ఆయనపై కొంతమంది దాడికి పాల్పడ్డారు. రాళ్లు, చెప్పులు.. ఏది దొరికితే దాంతో కొట్టారని ఆయన చెప్పారు. రాళ్ల దాడికి ఆయన పెట్టుకున్న హెల్మెట్ విరిగిపోయింది. ఈ నిరసనల తర్వాత ఎక్కడ చూసినా.. ఆందోళనకారులను పోలీసులు కొట్టారనే వార్తలే కన్పిస్తున్నాయి. కానీ, నాణేనికి మరోవైపు కూడా ఉంది. దాన్ని ఎవరూ పట్టించుకోవట్లేదు. ప్రజల కోసం సేవలందిస్తున్న వారి ఆవేదనను దేశమంతా వినాలి’’ అని ఓ అసిస్టెంట్ ఎస్సై భార్య సీమా భావోద్వేగానికి గురయ్యారు.

**నాన్నకు నాలుగు కుట్లు పడ్డాయ్..**

‘‘మా తాత బీఎస్ఎఫ్‌లో పని చేశారు. 1971 యుద్ధంలో పాల్గొన్నారు. ఆయన స్ఫూర్తితోనే నాన్న పోలీసు శాఖలో చేరి అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు. ఆందోళనల సమయంలో బారికేడ్ల వద్ద విధులు నిర్వహించారు. ఉన్నట్టుండి తమపై ఆందోళనకారులు రాళ్లు విసిరారని నాన్న చెప్పారు. సీనియర్ అధికారులను రక్షించే క్రమంలో ఆయన తలకు తీవ్ర గాయమైంది. నాలుగు కుట్లు పడ్డాయ్. నేనూ విద్యార్థినే. విద్యార్థుల పట్ల నాన్న ఎప్పుడూ దురుసుగా ప్రవర్తించరు. ఈ నిరసనల్లో రౌడీలు, సంఘ విద్రోహ శక్తులు ఉన్నారు’’ అని మరో పోలీసు కుమారుడు మీడియాకు తెలిపారు.

# వారికి డీఎన్ఏ టెస్ట్ చేయండి

## :రష్యాలో భారతీయుల మృతిపై ‘సుప్రీం’ ఆదేశాలు



రష్యా యుద్ధంలో మరణించిన భారతీయుల కుటుంబాలకు తగిన సాయం చేయాలని సుప్రీం కోర్టు విదేశాంగ శాఖ కు ఆదేశాలు జారీ చేసింది. బాధిత కుటుంబాలతో సమన్వయం చేసుకోవడానికి ఒక నోడల్ అధికారిని నియమించాలని పేర్కొంది. యుద్ధంలో మరణించిన వారి మృతదేహాలను గుర్తించేందుకు కుటుంబ సభ్యులకు డీఎన్ఏపరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. భారత్‌లోని రష్యా రాయబార కార్యాలయంలో పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఆ కుటుంబాలకు సహకరించాలని సూచించింది. ఈ విషయంపై బాధిత కుటుంబ సభ్యులకు స్థానిక భాషల్లో సమాచారం ఇవ్వాలని పేర్కొంది.

మంచి జీతంతో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మభ్యపెట్టి కొందరు ఏజెంట్లు తమ కుటుంబసభ్యులను రష్యా కు పంపించినట్లు పలు కుటుంబాలు పేర్కొన్నాయి. అక్కడికి వెళ్లాక రష్యా అధికారులు తమవారి పాస్‌పోర్ట్‌లు స్వాధీనం చేసుకొని.. బలవంతంగా ఉక్రెయిన్‌తో యుద్ధంలో పోరాడడానికి పంపారని ఆరోపిస్తూ సుప్రీం కోర్టు లో పిటిషన్ దాఖలు చేశాయి. దానిపై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం విదేశాంగ శాఖకు ఈ ఆదేశాలు జారీ చేసింది.

# ఐబీ అధికారి హత్య కేసు.. ఆప్ నేతకు జీవిత ఖైదు



ఈశాన్య దిల్లీలో 2020 అల్లర్ల కేసులో ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి అంకిత్ శర్మ హత్య కేసులో ఆమ్‌ఆద్మీ పార్టీ మాజీ కౌన్సిలర్ తాహిర్ హుస్సేన్‌కు దిల్లీ హైకోర్టు జీవిత ఖైదు విధించింది. అతడిపై మత విద్వేషాలను రెచ్చగొట్టడం, అల్లర్లకు పాల్పడటం, దాడి చేయడం, నేరపూరిత బలప్రయోగం, హత్య తదితర అభియోగాలు రుజువయ్యాయని కోర్టు పేర్కొంది.

2020 ఫిబ్రవరిలో ఈశాన్య దిల్లీలో సీఏఏ వ్యతిరేక నిరసనలు హింసాత్మకంగా మారిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ ఘటనలో 53 మంది మృతి చెందగా..700 మందికి పైగా గాయపడ్డారు. ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి అంకిత్ శర్మను కూడా అత్యంత కిరాతకంగా హత్య చేసి, చంద్‌బాగ్ పులియా ప్రాంతంలోని ఖజూరీ ఖాస్ కాలువలో మృతదేహాన్ని పడేశారు. మృతుడి తండ్రి రవీందర్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా దయాల్‌పుర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ హత్య కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ నేత తాహిర్ హుస్సేన్‌తో పాటు మరో నలుగురిని దిల్లీ కోర్టు దోషిగా తేల్చింది. వారందరికీ తాజాగా జీవిత ఖైదు విధించింది.

# పీఎం కిసాన్ పథకం.. మరో ఐదేళ్లు



దేశవ్యాప్తంగా రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తోన్న పీఎంకిసాన్ పథకాన్ని మరో ఐదేళ్లు (203031 ఆర్థిక సంవత్సరం వరకు) పొడిగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇందుకోసం రానున్న ఐదేళ్లకు గాను రూ.3.15 లక్షల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో దీనికి ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

ఐదేళ్లలో 5000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ‘ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన’కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.5070 కోట్లు కేటాయించింది. ఖేలో ఇండియాకు రూ.29వేల కోట్లు, సముద్ర మంథణ్ పథకానికి రూ.84వేల కోట్లు, సొరంగాల నిర్మాణం కోసం రూ.9779 కోట్లు కేటాయిస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది.

# ఆ సీఎంకు విడాకులు మంజూరు చేస్తాం: సుప్రీం కోర్టు



జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా. ఆయన భార్య పాయల్‌కు విడాకులు మంజూరు చేస్తామని సుప్రీంకోర్టు వెల్లడించింది. తమ వివాహ బంధాన్ని పరస్పర అంగీకారంతో రద్దు చేసుకుని.. పెండింగ్‌లో ఉన్న అన్ని వివాదాలను పరిష్కరించుకోవడానికి ఇరువురు అంగీకరించడంతో ఈ తీర్పు వెలువరించింది.

ఒమర్ అబ్దుల్లా.. పాయల్‌ను 1994లో వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమారులు. 2011లో ఒమర్ తన భార్య నుంచి విడిపోతున్నట్లు బహిరంగంగా ప్రకటించి.. వారి 17 ఏళ్ల వివాహ బంధానికి ముగింపు పలికారు. నాటి నుంచి వారు విడివిడిగా జీవిస్తున్నారు. ఆమెతో తనకు విడాకులు ఇప్పించాలని కోరుతూ 2016లో ఫ్యామిలీ కోర్టును ఒమర్ ఆశ్రయించారు. కానీ, న్యాయస్థానం దానిని తిరస్కరించింది. దీన్ని సవాల్ చేస్తూ 2023లో దిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అక్కడ కూడా ఆయనకు నిరాశే మిగిలింది. దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. దీంతో గతేడాది సుప్రీం కోర్టు ను ఆశ్రయించారు. పరస్పర అంగీకారంతో తమ వివాహ బంధాన్ని రద్దు చేసుకోవాలని అనుకుంటున్నట్లు ఇరువురు ఈ నెల మొదట్లో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం వీరికి విడాకులు మంజూరు చేస్తామంది.

# ప్రధాని మోదీ వీడియోపై సీజేపీ నాయకుడు దీప్కే కామెంట్

ప్రశ్నపత్రాల లీకు మాఫియా ఆటకట్టించడమే కొత్త చట్టం ఉద్దేశమంటూ ప్రధాని మోదీ ఇన్‌స్టాలో చేసిన పోస్టుపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందించారు. యాంటీ పేపర్ లీక్ బిల్లు ఉభయసభల్లో ఆమోదం పొందిన నేపథ్యంలో మోదీ ప్రత్యేక వీడియో షేర్ చేశారు. దీనిపై దీప్కే స్పందిస్తూ.. ‘‘దేశ భవిష్యత్ కంటే మీరే ధగధగలాడుతున్నారు’’ అని అర్థం వచ్చేలా ఆ వీడియోకు కామెంట్ పెట్టారు.

మరోవైపు దీప్కే రోజురోజుకూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శల తీవ్రతను పెంచుతున్నారు. జంతర్ మంతర్ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులపై ప్రభుత్వ వేధింపులను ఆపాలని.. నిరసనకారులపై పెల్లెట్ తుపాకులు వాడేలా పోలీసులకు అనుమతి ఇచ్చిన వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దారికి రాకపోతే యువత ప్రభుత్వాన్నే మారుస్తుందన్నారు..





## అన్నింటా సీసం... ఆదమరిస్తే నష్టం!

బెంగళూరులోని సెయింట్ జాన్స్ మెడికల్ కాలేజీ 'ఎమెరిటస్' ప్రొఫెసర్‌గా ఉన్న వెంకటేష్ లెడ్ ముప్పుపై దశాబ్దాలుగా పోరాడుతున్నారు. సీసం కాలుష్య నిర్మూలనకు, నాణ్యతా ప్రమాణాల పెంపునకు కృషి చేస్తున్నారు. ఆయన ప్రస్తుతం 'ఫౌండేషన్ ఫర్ క్వాలిటీ ఇండియా(ఎఫ్‌క్యూఐ)'కి సీఈవో, డైరెక్టర్‌గా, 'నేషనల్ రిఫరల్ సెంటర్ ఫర్ లెడ్ ప్రాజెక్ట్స్ ఇన్ ఇండియా'కు డైరెక్టర్‌గా సేవలు అందిస్తున్నారు. 'క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ)' పరిధిలోని ఎన్ఏబీఎల్, ఎన్ఏబీహెచ్ సంస్థలకు ప్రిన్సిపల్ అసెసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఐరాస పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (యూఎన్ఐడీవో), డబ్ల్యూహెచ్‌వోలకు సాంకేతిక సలహాదారుగా సేవలందిస్తున్నారు. వెంకటేష్ పలు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు. వివిధ అంతర్జాతీయ జర్నల్స్‌లో ఆయన పరిశోధనా పత్రాలు 350కి పైగా ప్రచురితమయ్యాయి.

**సీసం శరీరంలోకి ఎలా ప్రవేశిస్తుంది?**

దాన్ని బ్యాటరీలు, రంగులు, ప్లంబింగ్ పైపుల్లో వాడుతుంటారు. వీటి నుంచి సీసం సూక్ష్మ కణాలుగా మారి గాలి, మట్టి, నీటిలో కలుస్తుంది. ఆ నీరు, మట్టి ద్వారా మనం పండించే కూరగాయలు, పండ్లలోకి చేరుతుంది. వాటిని తిన్నప్పుడు మన శరీరంలోకి సీసం ప్రవేశిస్తుంది. విగ్రహాలకు వేసే చౌక రంగుల్లోనూ సీసం అధికంగా ఉంటుంది. ఆ విగ్రహాలను చెరువుల్లో కలిపినప్పుడు నీరు కలుషితం అవుతుంది. అదే నీటిని ఆవులు, గేదెలు తాగితే ఆ సీసం వాటి పాల ద్వారా మనుషుల శరీరాల్లోకి చేరుతుంది. ఇదొక గొలుసుకట్టు ప్రక్రియ. మన దేశంలో ఇళ్లల్లో వాడే డొమెస్టిక్, డెకరేటివ్ పెయింట్స్‌లో మాత్రమే సీసం తక్కువగా ఉండేలా నిబంధనలున్నాయి.

**సౌందర్య సాధనాలు, నిత్యం వాడే వస్తువుల్లోనూ సీసం ఉంటుందా?**

అవును. కొన్ని రకాల నాణ్యత లేని లిప్‌స్టిక్, నెయిల్ పాలిష్, ముఖ్యంగా 'హెయిర్ డై'లలో దాదాపు మూడు శాతం వరకు సీసం ఉంటుంది. ఇది చాలా ఎక్కువ పరిమాణమే. హెయిర్ డై తలకు పెట్టుకున్నప్పుడు చర్మం ద్వారా రక్తంలోకి, ఆపై కిడ్నీలకూ చేరి అవయవాలను దెబ్బతీస్తుంది. పాత కార్ల ఇంజిన్ భాగాలను కరిగించి తయారుచేసే కొన్ని రకాల పాత్రలు, ప్రెజర్ కుక్కర్ల ద్వారా వండేటప్పుడూ ఆహారంలోకి సీసం వెళ్తుంది. పిల్లల పెన్సిళ్లపై ఉండే రంగుల్లోనూ సీసం ఉంటుంది. చిన్నారులు పెన్సిళ్లను నోట్లో పెట్టుకున్నప్పుడు శరీరంలోకి చేరుతుంది.

**పిల్లలపై సీసం ప్రభావం ఎలా ఉంటుంది?**

ఆహారం, గాలి, చర్మం ద్వారా సీసం మనుషుల శరీరంలోకి ప్రవేశించి అవయవాలను దెబ్బతీస్తుంది. ముఖ్యంగా గర్భిణుల శరీరంలోకి వెళ్తే, అది నేరుగా కడుపులోని బిడ్డ మెదడుకు చేరుతుంది. పిల్లల రక్తంలో సీసం ఎక్కువగా ఉంటే ఐక్యూ తగ్గుతుంది. జ్ఞాపకశక్తి తగ్గడం, ఏకాగ్రత లేకపోవడం, రక్తహీనత, కడుపునొప్పి, కీళ్లనొప్పులు వస్తాయి. ఎముకల్లోని సీసం క్యాల్షియం అణువులను తొలగించడంవల్ల బోన్ వ్యాధులు వస్తాయి.

**లెడ్ నియంత్రణకు ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు?**

దేశవ్యాప్తంగా 'ప్రాజెక్ట్-797' కింద ప్రతి జిల్లా ఆసుపత్రిలో ఒక విభాగాన్ని ఏర్పాటు చేసి, ఆ జిల్లాలో లెడ్ కాలుష్యం, పురుగు మందుల ప్రభావంపై బయో మానిటరింగ్ ద్వారా డేటా సేకరిస్తాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. పిల్లల ఆరోగ్యం మీదా దృష్టి పెడుతున్నాం. తెలంగాణలో మొదటి దశగా కరీంనగర్‌లో ఒక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను ఎంపిక చేసి 200-300 మంది పిల్లలకు స్వచ్ఛందంగా లెడ్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తాం. వారి శరీరంలో సీసం ఎక్కువగా ఉంటే, పోషకాహార లోపనివారణ, పర్యావరణ మార్పుల ద్వారా చికిత్స అందిస్తాం. ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి వారిని 'లీడర్'గా తీర్చిదిద్దుతాం. దీంతో వారు పిల్లలకు వారి కుటుంబాలకు అవగాహన కల్పిస్తారు.

**సీసం బారిన పడకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?**

లెడ్ కాలుష్యం వందశాతం నివారించదగినదే. ఇళ్లకు రంగులు వేసేటప్పుడు 90 పీపీఎంలోపు ఉన్న బ్రాండెడ్ రంగులనే ఎంచుకోవాలి. పాత రంగులను తొలగించేటప్పుడు వచ్చే దుమ్ము శ్వాస ద్వారా శరీరంలోకి వెళ్లకుండా మాస్కులు ధరించాలి. పిల్లల్లో చేతులు, బొమ్మలను నోట్లో పెట్టుకునే అలవాటును నిలువరించాలి. కోటింగ్ సరిగా చేయని రాగి పాత్రలు, నాణ్యత లేని సిరామిక్, మట్టి పాత్రల్లో వంట చేయడం, నిల్వ చేయడం తగ్గించాలి. రంగుల ప్లాస్టిక్ బొమ్మలు, చౌక పెయింట్ బొమ్మలు వాడకూడదు. లెడ్ లేదని నిర్ధారించుకున్న రంగులనే వినియోగించాలి. మాస్కులు ధరించడం వల్ల కూడా గాలిలోని సీసాన్ని పీల్చకుండా ఉండవచ్చు. కొవిడ్ సమయంలో మాస్కులు వాడటంతో ప్రపంచవ్యాప్తంగా లెడ్ స్థాయులు తగ్గాయి.



# ప్రజాఫర్మానాకు ఫిరాయింపుల తూట్లు

**ప్రజాస్వామ్యానికి మూలం ప్రజల తీర్పు. అంటే జనాదేశం. ప్రజల ప్రతినిధిగా స్థానిక సంస్థలకో, శాసనసభకో, పార్లమెంటుకో ఎన్నికయ్యేవారు ఈ జనాదేశాన్ని అనుసరించి నడుచుకోవాలి. అందుచేత పార్టీ ఫిరాయించడమనేది ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును ఉల్లంఘించడమే. అధికారం చేజిక్కించుకోవడానికి ఫిరాయింపులను ఆశ్రయించడం, మూడింట రెండొంతుల బలంతో చీలికలు తెచ్చి పబ్బం గడుపుకోవడం.. ఫిరాయింపుల నిరోధక చట్టం ఆశయాన్ని నీరుగారుస్తున్నవి. ఫిరాయింపుల చట్టానికి ఎన్ని సవరణలు చేసినా ఈ రాజకీయ అవినీతి బుల్డోజర్‌ను అడ్డుకోలేకపోతున్నాయి. కేంద్ర పాలకపక్షం స్వహస్తాలతో ఈ ఘాతుకానికి పాల్పడుతుండడాన్ని చూసి ప్రజాస్వామ్యం ముక్కున వేలేసుకుంటున్నది.**



తగిన మెజారిటీ లేక ఇటీవల వీగిపోయిన డీలిమిటేషన్, చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ సంయుక్త రాజ్యాంగ సవరణ బిల్లు స్థానంలో మళ్లీ అదే బిల్లును ప్రవేశపెట్టి ఈసారి నెగ్గించుకోవడానికి కేంద్రంలోని ఎన్డీఏ పాలకులు తృణమూల్ కాంగ్రెస్, శివసేన(ఉద్ధవ్)లో చీలికలు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీనివల్ల లోక్‌సభలో ఎన్డీఏ బలం పెరిగింది. కానీ రాజ్యాంగ సవరణ బిల్లు నెగ్గడానికి అవసరమైనంతగా అది పెరగలేదు. అయినా ప్రలోభాల ఎరవేసి ప్రతిపక్షంలో చీలికలు తేవడంలో తమకున్న నేర్పు మీద భరోసాతో ఎన్డీఏ పాలకులు ఈ రాజ్యాంగ సవరణ బిల్లును మరోసారి ముందుకు తోయాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తున్నది.


లోక్‌సభలో, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం స్థానాల రిజర్వేషన్‌ను అమల్లోకి తేవడం కోసం 'నారీశక్తి వందన్ అధినియం' పేరిట 2023లో 106వ రాజ్యాంగ సవరణను తీసుకొచ్చారు. అయితే 2027 తర్వాత జరిగే నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణతో దీనిని ముడిపెట్టారు. ఇందువల్ల చట్టసభల్లో మహిళల కోటా దాదాపు 2034 వరకు అమలుకు నోచుకోని పరిస్థితి తలెత్తింది. ఇప్పుడు తమ రాజకీయ అవసరాల కోసం 2011 జనగణన ప్రాతిపదికగా డీలిమిటేషన్(నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ) చేపట్టి లోక్‌సభ నియోజకవర్గాలను సగం పెంచాలని, అదే పనిగా మహిళలకు చట్టసభల్లో 33శాతం కోటాను అమల్లోకి తేవాలని సంకల్పించి సంయుక్త రాజ్యాంగ సవరణ బిల్లును ఉద్దేశించారు.

చట్టసభల బలాన్ని పెంచడం కోసం జరపవలసిన సీట్ల పెంపు వ్యవహారం చుట్టూ అత్యంత వివాదం అల్లుకున్న సంగతి తెలిసిందే. ఆయా రాష్ట్రాల జనాభా ప్రకారం జరగవలసిన ఈ ప్రక్రియ వల్ల కుటుంబ నియంత్రణను కచ్చితంగా పాటించి జనాభా పెరుగుదలను పరిమితం చేసుకొని, అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న దక్షిణాది రాష్ట్రాలు ఈ పెంపులో తక్కువ సీట్లు పొందుతాయి. మరోపక్క జనాభా నియంత్రణలో, అభివృద్ధిలో బాగా వెనుకబడి ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ స్థానాలు లభిస్తాయి. ఫలితంగా దక్షిణాదికి తీవ్ర అన్యాయం జరుగుతుంది. అందుచేత జనాభా ప్రాతిపదికగా సీట్ల పెంపును దక్షిణాది రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. అన్ని రాష్ట్రాలలో నియోజకవర్గాలను 50శాతం పెంచే చిట్కాను అమల్లోకి తెచ్చి ఈ వివాదం నుంచి బయటపడాలని కేంద్రంలోని ఎన్డీఏ పాలకులు ఆశిస్తున్నారు. మహిళల రిజర్వేషన్లను ముందుకు జరిపించి డీలిమిటేషన్‌కు జత చేయడం ద్వారా ప్రతిపక్షాన్ని కట్టడి చేయాలన్న ఉపాయాన్ని ఆశ్రయిస్తున్నారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేస్తే మహిళా వ్యతిరేకులుగా ముద్ర పడుతుందని విపక్షాలు భయపడతాయని పాలకపక్షం ఈ ఎత్తు వేసింది. విడిగా మహిళల రిజర్వేషన్ చట్టాన్ని అమలులోకి తెస్తే తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేస్తూ సమైక్య ప్రతిపక్షం సంయుక్త రాజ్యాంగ సవరణ బిల్లును ఓడించిన అపూర్వ అమోఘ సన్నివేశాన్ని గత ఏప్రిల్ 17న పార్లమెంట్‌లో చూడగలిగాం. ప్రతిపక్షం అపూర్వమైన ఐక్యతను ప్రదర్శించింది. ఇది ప్రధాని మోదీని అమితంగా కలచివేసిందని అంటున్నారు. అందుచేత పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లును మళ్లీ తెచ్చి నెగ్గించుకోవాలని చూస్తున్నారు. ఇందుకోసమే అటు తృణమూల్ కాంగ్రెస్, ఇటు శివసేనలో చీలికలు తీసుకొచ్చారు. దీనివల్ల లోక్‌సభలో ఎన్డీఏ బలం 25 స్థానాలు పెరిగి 313కి చేరింది. అయినప్పటికీ రాజ్యాంగ సవరణకు కావలసిన మూడింట రెండొంతులకు (362) ఇంకా తక్కువే. కాబట్టి ప్రతిపక్షాలను మరిన్ని ప్రలోభాలతో మరింతగా చీల్చి బిల్లును నెగ్గించుకోవడానికి ఎన్డీఏ పాలకులు వెనుకాడకపోవచ్చు. ఇది ప్రతిపక్ష ఐక్యతకు పెను సవాలే!

పాలకపక్షం అధికారం అండతో తెచ్చే ఇటువంటి చీలికలు ప్రజాస్వామ్య పునాది అయిన జనాదేశానికి తూట్లు పొడిచి ప్రజాప్రాతినిధ్య పరమార్థానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయి. అందుచేత ఎన్నికల్లో ఏ పార్టీ ద్వారా నెగ్గారో అదే పార్టీలో చివరివరకూ కొనసాగవలసిన విధ్యుక్త ధర్మాన్ని విధిగా పాటించేలా తగిన చట్టాన్ని తీసుకురావాలి.

# సమాజానికి సిగ్గుచేటు!

**ఏ దేశంలో అయినా జనాభా స్థిరత్వానికి, ఆరోగ్యకరమైన కుటుంబ వ్యవస్థకు, సామాజిక అభివృద్ధికి లింగ నిష్పత్తి సమతూకంగా ఉండటం తప్పనిసరి. కానీ, 'సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్' నివేదిక ప్రకారం, సిక్కిం మినహా భారతావనిలో 2024లో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 933 మంది అమ్మాయిలు మాత్రమే జన్మించారు. ఆ ఏడాది జాతీయ సగటుతో పోలిస్తే 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఆడపిల్లల జననాలు మరింత తక్కువగా నమోదయ్యాయి. నాగాలాండ్‌లో అవి అతి స్వల్పంగా (806) ఉంటే- ఝార్ఖండ్‌లో 890, బిహార్‌లో 894, గుజరాత్ 908, హరియాణా, తెలంగాణల్లో 910 చొప్పున, ఏపీలో 929గా లెక్కతేలాయి. తెలంగాణలోని 17 జిల్లాల్లో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 900 మంది కంటే తక్కువ అమ్మాయిలు జన్మిస్తే, ఏపీలో మూడు జిల్లాల్లో అదే తరహా దురదృష్టకర పరిస్థితులు నెలకొన్నాయి. నల్గొండ జిల్లాలో మరీ తక్కువగా 787 మంది ఆడశిశువులే ఊపిరిపోసుకోవడం దేన్ని సూచిస్తోంది? ఈ గణాంకాలన్నీ దేశీయంగా పాతుకుపోయిన పితృస్వామ్య భావజాలాన్ని, లింగ వివక్షలనే కళ్లకుకడుతున్నాయి. ఒకపక్క ఆడబిడ్డలను ప్రాణప్రదంగా చూసుకుంటూ బాగా చదివిస్తున్న కుటుంబాలు క్రమంగా పెరుగుతున్నాయి.అదే సమయంలో మగపిల్లలే వంశోద్ధారకులనే బూజుపట్టిన ఆలోచనలతో ఆడపిల్లలను గుండెల మీద కుంపట్లుగా చూస్తున్నవారి మూలంగా ఇంకా కొనసాగుతున్న భ్రూణహత్యలు సమాజానికే సిగ్గుచేటు అవుతున్నాయి!**



ఆడబిడ్డలను కాపాడుకునేందుకు గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ(పీసీపీఎన్‌డీటీ) చట్టాన్ని తెచ్చినా, వ్యవస్థాగత లోపాల వల్ల దోషులకు శిక్షలు కొరవడుతున్నాయి. తత్ఫలితంగా దేశవ్యాప్తంగా ఎన్నో స్కానింగ్ సెంటర్లు, ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు నిర్వహిస్తూ భ్రూణహత్యలకు కారణమవుతున్నాయి. కొంతమంది ఆర్ఎంపీలు మొబైల్ స్కానింగ్ యంత్రాలతో గ్రామాలకే వెళ్లి గర్భస్థ ఆడశిశువుల ఉసురు పోసుకుంటున్నా అధికార యంత్రాంగం సమర్థంగా నిలువరించలేకపోతోంది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ తదితర జిల్లాల్లో ఇలాంటి దారుణాలు యథేచ్ఛగా సాగుతున్నట్లు నిరుడు వెల్లడైంది. మరికొందరు దుర్మార్గులు అద్దె ఇళ్లలో అనైతిక స్కానింగ్ సెంటర్లు తెరుస్తున్నా వెంటనే అడ్డుకునేవారు కరవవుతున్నారు. అనంతపురంలో ఓ ప్రబుద్ధుడు ఇలాగే రెండు మూడు నెలల్లో 128 మందికి అక్రమంగా స్కానింగ్‌లు తీసినట్లు తేలింది. ఇలాంటి వాటికితోడు కుటుంబసభ్యుల ఒత్తిడిని భరించలేక కొంతమంది తల్లులు అప్పుడే పుట్టిన ఆడబిడ్డల్ని నిస్సహాయంగా వదిలేస్తుండటం దేశమెంతగా పురోగమిస్తున్నా తగ్గని సామాజిక జాడ్యాల తీవ్రతను పట్టిచూపుతోంది!

అబ్బాయే కావాలనే అనాగరిక ధోరణి మూలంగా గడిచిన అయిదు దశాబ్దాల్లో ఇండియాలో నాలుగున్నర కోట్ల మందికి పైగా అమ్మాయిలు అమ్మ కడుపులోనో లేదా భూమ్మీదకు వచ్చాకో కడతేరిపోయారన్నది ఐరాస జనాభా నిధి అంచనా! దేశీయంగా నెలకొన్న అరాచక పరిస్థితులకు ఇది అద్దంపడుతోంది. లింగ నిష్పత్తిలో సమతౌల్యం దెబ్బతింటే ఆడపిల్లల అక్రమ రవాణా, బలవంతపు పెళ్లిళ్లు, బాల్యవివాహాలు పెరిగిపోయే ప్రమాదం ఉంది. స్త్రీలపై హింస సైతం తీవ్ర స్థాయికి చేరుతుంది. లింగపరమైన అసమతుల్యత దీర్ఘకాలం కొనసాగితే కుటుంబ వ్యవస్థ బలహీనపడి సామాజిక అశాంతి ప్రబలుతుంది. ఈ ఉత్పాతాన్ని నివారించాలంటే స్కానింగ్ సెంటర్లపై నిరంతరం నిఘా ఉంచాలి. అడ్డగోలుగా అబార్షన్లు చేస్తున్న వైద్యులను తప్పక దండించాలి. ఆ మేరకు పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలి!

# ట్రంప్ దూసిన వీసా కత్తి!

**మితవాద రాజకీయం ఊరకే ఉండదు. నిరంతరం కొత్త శత్రువుల్ని వెదుక్కుంటుంది. తన చర్యల పర్యవసానంగా పుట్టుకొచ్చే సంక్షోభాలనుంచి జనం దృష్టి మరల్చడానికి నానా తంటాలూ పడుతుంది. ఆ రాజకీయంలోనే పుట్టి, దాన్ని మరింత దిగజార్చిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రెండో దఫా వచ్చాక వలసలపై కత్తిగట్టారు. అమెరికాలో చదువుకోవటానికొచ్చినవారు గరిష్ఠంగా నాలుగేళ్లకు మించి ఉండటానికి వీల్లేదంటూ తాజాగా తీసుకురావాలనుకుంటున్న నిబంధన ఆ పరంపరలో భాగమే. ఇతరేతర వీసాల సంగతి సరేసరి. ప్రపంచ దేశాల్లోని వారందరికీ ఉన్నత చదువుల గమ్యస్థానం అమెరికాయే. అక్కడ చదువుకుంటే సాఫ్ట్‌వేర్, ముఖ్యంగా కృత్రిమ మేధ (ఏఐ) రంగాల్లో మెరుగైన జీతాలతో కొలువులొస్తాయన్న నమ్మకమే అందుకు కారణం. అయితే ట్రంప్ తీసుకున్న కొత్త నిర్ణయంవల్ల విద్యార్థులకు మాత్రమే కాదు... అక్కడి విద్యాలయాలు, టెక్ రంగ సంస్థలకు కూడా సమస్యలొస్తాయి. విద్యాలయాల వేల కోట్ల ఆదాయం పడిపోతే, టెక్‌రంగ సంస్థలకు నిపుణుల కొరత ఏర్పడుతుంది.**




ఎందుకంటే స్థానికులతో పోలిస్తే విదేశాలనుంచి వచ్చే విద్యార్థులు చదువుల్లో, తెలివితేటల్లో చాలా ముందంజలో ఉంటారు. డిగ్రీ చదువులకొచ్చేవరకూ స్వదేశీయులకు అంతా ఉచితమే అయినా, అటుపై తడిసిమోపెడవుతుంది. వారితో పోలిస్తే నిజానికి విదేశీ విద్యార్థులు రెండు మూడు రెట్లు అధికంగా చెల్లించాలి. ఆ మొత్తంతోనే స్థానికులకు స్కాలర్‌షిప్‌లిస్తారు. వారినుంచి తక్కువ ఫీజు వసూలు చేస్తారు. స్థానికులు హ్యూమనిటీస్, ఆర్ట్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, లా తదితర కోర్సుల్లో ఆసక్తి కనబరుస్తారు. సాంకేతిక రంగంలో దూసుకెళ్లే అమెరికాకు 'స్టెమ్'(సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్) విభాగంలో నిపుణులు అవసరం. విదేశీయులు కఠినమైన వడపోత తర్వాత ఆ కోర్సులు చదవడానికి వెళ్లినవారు గనుక ఆ కోర్సులను సులభంగా ఆకళింపు చేసుకుంటారు. స్టెమ్ కోర్సుల్లో మాస్టర్స్, పీహెచ్‌డీ స్థాయిలో 70 శాతం సీట్లు విదేశీయులకే లభించటం ఇందుకే. స్థానికుల్ని వారితో పోటీపడేలా తీర్చిదిద్దటానికి తాము చేయాల్సిందేమిటన్న దృష్టి ట్రంప్‌కుగానీ, ఆయన ముందున్న పాలకులకుగానీ లేదు.

తగినంతమంది సాంకేతిక నిపుణులు స్థానికంగా లభ్యంకాకపోవటంవల్లనే అమెరికా దిగ్గజ టెక్ సంస్థలు విదేశాలనుంచి వచ్చేవారిని ఎంపిక చేసుకోవాల్సివస్తున్నది. అలా భర్తీ చేసుకోనట్టయితే ఇన్నోవేషన్ రంగంలో ఆ దేశం వెనకబడిపోతుంది. అదిగాక విదేశీ విద్యార్థులు చెల్లించే వేలాది కోట్ల డాలర్ల ఫీజులు, టెక్ సంస్థల విస్తరణ, లాభార్జనల వల్ల మరిన్ని వేలకోట్ల డాలర్లు పన్నుల రూపంలో ఖజానాకు సమకూరుతాయి. ఇతరత్రా సంస్థల సంగతలావుంచి మన భారత సంస్థలు టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కార్పొరేట్ పన్ను రూపంలోనే నిరుడు 867 కోట్ల డాలర్లు (రూ. 73,000 కోట్లకు పైగా) చెల్లించాయి. మొత్తంగా అన్ని సంస్థలూ 13,008 కోట్ల డాలర్లకు పైగా (రూ. 10,99,166 కోట్లుల్‌పైగా) చెల్లించాయి. ఇవిగాక జీఎస్‌టీ, కస్టమ్స్ సుంకం, ఉద్యోగులు చెల్లించే టీడీఎస్‌లు అదనం. ఇంతగా లాభపడుతూ బాధిత దేశంగా శోకించటం అమెరికాకే చెల్లింది.

వీసా వ్యవస్థ దశాబ్దాలుగా దుర్వినియోగమవుతున్నదనీ, దేశ భద్రత ప్రమాదంలో పడిందనీ గొంతుచించుకుంటున్న అమెరికా తాను ఎడాపెడా వర్ధమాన, వెనకబడిన దేశాలనుంచి దశాబ్దాలుగా కొల్లగొడుతున్న సంపద గురించి మాట్లాడదు. ఇందులో ఆ దేశాల పాలకుల తప్పు కూడా ఉంది. మన దేశం సంగతే తీసుకుంటే 2047 కల్లా 'వికసిత్ భారత్' తీసుకొస్తామంటారు. కానీ అమెరికా మాదిరిగా కనీసం డిగ్రీవరకూ ఉచిత విద్య, నామమాత్రపు ఫీజులతో ఆపై విద్య అందుబాటులోకి తెచ్చే ఆలోచన చేయరు. జీడీపీలో కనీసం 6 శాతం విద్యకు వ్యయం చేయాలన్న లక్ష్యం పాటించరు. హైస్కూల్ విద్యవరకూ శ్రద్ధ పెడుతున్నట్టు కనబడుతూ ఆపై చదువుల్ని కార్పొరేట్లకు వదిలేశారు. వేలాదిమంది ప్రొఫెసర్ల కొరతతో విశ్వవిద్యాలయాలు దయనీయ స్థితిలో పడినా పట్టదు. కొలువుల సంగతి సరేసరి. ఇలాంటి స్థితిలో ట్రంప్ బెదిరిస్తే, పరిమితులు విధిస్తే నిస్సహాయంగా మిగలటం తప్ప మన యువత చేయగలిగేది ఏముంది?

# 2029లో వైసీపీదే అధికారం భారీ మెజారిటీతో గెలుస్తాం



(మొదటిపేజీ తరువాయి)

అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విధానంలో ఎలాంటి మార్పు ఉండదని అన్నారు. పరిస్థితులకు అనుగుణంగా మారే నాయకుడు కాదని, తన సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే నాయకుడేనని జగన్‌ను అభివర్ణించారు.
చంద్రబాబు నాయుడు రాజకీయాలు అధికారం కోసం ఉంటే, వైసీపీ రాజకీయాలు ప్రజల కోసం ఉంటాయని సజ్జల వ్యాఖ్యానించారు. ఒకప్పుడు కొన్ని వర్గాలు మీడియాను ఉపయోగించి ప్రజల్లో భ్రమలు సృష్టించాయని, ప్రస్తుతం సోషల్ మీడియా ప్రజలతో నేరుగా మమేకమయ్యే అత్యంత ప్రభావవంతమైన వేదికగా మారిందని చెప్పారు. అయితే, 2029 అసెంబ్లీ ఎన్నికల్లో గతం కంటే మరింత భారీ మెజారిటీతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందనే పూర్తి నమ్మకం తమకు ఉందని సజ్జల తెలిపారు. పార్టీ కార్యకర్తల త్యాగాలు, కష్టాల వల్లే వైసీపీ ఈ స్థాయిలో నిలబడగలిగిందని కొనియాడారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా జగన్ ముందుండి నాయకత్వం వహిస్తున్నారని అన్నారు.
స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని వెల్లడించిన సజ్జల, ఒక్క పంచాయతీని కూడా పోటీ లేకుండా వదిలే పరిస్థితి ఉండదని జగన్ స్పష్టం చేశారని గుర్తు చేశారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగితే వైసీపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల జగన్ పర్యటనలకు ప్రజల నుంచి లభిస్తున్న విశేష స్పందనే రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందనే విషయాన్ని నిరూపిస్తోందని పేర్కొన్నారు. పేదలకు ఉపయోగపడని రాజకీయాలకు జగన్ ఎప్పుడూ ప్రాధాన్యం ఇవ్వరని సజ్జల అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం భారీ పరిశ్రమలు, పోర్టులు, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని, కేవలం పైపై కనిపించే అభివృద్ధి (కాస్మెటిక్ డెవలప్‌మెంట్) వల్ల ప్రజలకు ప్రయోజనం ఉండదని అభిప్రాయపడ్డారు.
సోషల్ మీడియా కార్యకర్తలకు ప్రత్యేక సూచనలు చేసిన సజ్జల, వైఎస్ జగన్ చెప్పే అంశాలను చిన్న చిన్న వీడియోలు, క్యాప్సూల్స్ రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి సోషల్ మీడియా కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేర్చే ప్రచారకుడిగా పనిచేయాలని కోరారు. అసభ్య పోస్టులు, వ్యక్తిగత దూషణలు, అనుచిత వ్యాఖ్యలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. పార్టీ కమ్యూనికేషన్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించుకుని ప్రతి నియోజకవర్గంలో సోషల్ మీడియా బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి..

# ఫార్ములా ఈకార్ కేసులో నాంపల్లి కోర్టుకు కేటీఆర్

(మొదటిపేజీ తరువాయి)



ఈ కేసులో ఏ2గా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బి.ఎల్.ఎన్.రెడ్డిలతో కలిసి ఏ1 నిందితుడిగా ఉన్న కేటీఆర్ నాంపల్లి ఏసీబీ కోర్టులో ప్రత్యక్షం అయ్యారు. కేటీఆర్‌కు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, సీనియర్ నాయకుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌లతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు కోర్టు ఆవరణకు తరలివచ్చారు. బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలిరావడంతో నాంపల్లి కోర్టు పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి.. కొంతసేపు ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది.

**రూ.55 కోట్ల నిధుల దుర్వినియోగం ఆరోపణలు**

ఫార్ములాఈ రేసు నిర్వహణలో హెచ్‌ఎండీఏ నిధులను అక్రమంగా వాడారని ఏసీబీ ప్రధానంగా అభియోగం మోపింది. ఫార్ములాఈ రేస్, రేసింగ్ ట్రాక్ నిర్మాణం, ఇతర అనుబంధ ఏర్పాట్ల పేరిట హెచ్‌ఎండీఏ ఖజానా నుంచి రూ.55 కోట్లకు పైగా నిధులను వెచ్చించారని తెలిపింది. ఎలాంటి అధికారిక రికార్డులు పాటించకుండా ఈ ఖర్చులు చేయడం ద్వారా ఆడిట్ తనిఖీల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశారని ఏసీబీ పేర్కొంది. మూడు సీజన్లకు వర్తించే వ్యయాన్ని ఒకే ఒక్క రేసుకు చేసిన ఖర్చుగా చూపించి.. రాష్ట్ర మంత్రివర్గ ఆమోదం తీసుకోకుండా నిబంధనలను పక్కనబెట్టారని పేర్కొంది.

**నిధుల దుర్వినియోగంతో రూ.8.06 కోట్ల అదనపు భారం**

విదేశీ సంస్థలకు నిధుల బదిలీ విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలను, దేశీయ పన్ను విధానాలను ఉల్లంఘించారని ఏసీబీ దర్యాప్తులో తేల్చింది. ఈ చెల్లింపుల ప్రక్రియలో జరిగిన అక్రమాల కారణంగా ప్రభుత్వ ఖజానాపై రూ.8.06 కోట్ల మేర అదనపు పన్నుల భారం పడిందని స్పష్టం చేసింది. కేటీఆర్, అర్వింద్ కుమార్‌లపై చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి ప్రాసిక్యూషన్ అనుమతులు లభించిన అనంతరమే ఏసీబీ కోర్టులో అధికారికంగా ఛార్జిషీట్ దాఖలు చేసింది.

# ధర్మేంద్ర రాజీనామా సాధ్యమయ్యేదే కాదువ

న్యూఢిల్లీ, జులై 31, అనంతజనశక్తి న్యూస్



సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌తో తనకు విభేదాలు ఉన్నాయన్న వార్తలను కాక్రోచ్ జనతాపార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కొట్టిపారేశారు. నీట్ పేపర్ లీక్ ఉద్యమంలో ఆయన త్యాగాన్ని ఎన్నటికీ మర్చిపోలేమని అన్నారు. తమ మధ్య ఏకాభిప్రాయం ఉందని స్పష్టం చేశారు. జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అభిజీత్ దీప్కే ఈ వ్యాఖ్యలు చేశారు.
ఆందోళన ముగింపు ప్రసంగంలో సోనమ్ వాంగ్‌చుక్ గురించి తాను ప్రస్తావించకపోవడానికి విభేదాలే కారణమన్న వాదనను అభిజీత్ తోసిపుచ్చారు. తమ మధ్య ఏకాభిప్రాయం ఉందని అన్నారు. ఆయనతో ఫోన్‌లో మాట్లాడినట్టు కూడా తెలిపారు. నాటి ఆందోళన యువత చేపట్టారని, పోలీసు చర్యలను ఎదుర్కొన్నారని అన్నారు. కాబట్టి తన ప్రసంగంలో వారికి ధన్యవాదాలు తెలిపానని అభిజీత్ వివరించారు.

**వాంగ్‌చుక్ దీక్షతోనే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా..**

'కానీ వాంగ్‌చుక్ సర్ త్యాగాన్ని మేము ఎన్నటికీ మర్చిపోలేము. ఆయన తన ప్రాణాల్ని సైతం లెక్క చేయక 26 రోజుల పాటు ఆమరణ దీక్ష చేశారు. తన ప్రాణాల్ని పణంగా పెట్టి జాతి అంతరాత్మను జాగృతం చేశారు. యువత వీధుల్లోకి వచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నించేలా చేశారు. ఆయన ఆమరణ దీక్ష చేయకుంటే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా సాధ్యమయ్యేదే కాదు' అని అన్నారు. ఆమరణ దీక్షను ముగించాలని తాను వ్యక్తిగతంగా ఎన్నోసార్లు చెప్పానని అన్నారు.
కేంద్ర మంత్రుల సమక్షంలో వాంగ్‌చుక్ దీక్షను విరమించడం విచారం కలిగించిందా? అన్న ప్రశ్నకు అలాంటిదేమీ లేదని అభిజీత్ బదులిచ్చారు. ఆసుపత్రిలో వాంగ్‌చుక్‌ను కలిసేందుకు తనను అనుమతించకుండా, కేంద్ర మంత్రులకు ఆ అవకాశం కల్పించినందుకు అసంతృప్తి కలిగిందని చెప్పారు. ఇతర సీజేపీ సభ్యులతో పాటు ప్రతిపక్ష నాయకులను కూడా వాంగ్‌చుక్‌ను కలిసేందుకు అనుమతించలేదని అన్నారు. ఒక రకంగా చూస్తే కేంద్రం వాంగ్‌చుక్‌ను కిడ్నాప్ చేసినట్టేనని వ్యాఖ్యానించారు. అయితే, వాంగ్‌చుక్ తన దీక్షను విరమించారని తెలిసి ఊపిరి పీల్చుకున్నట్టు దీప్కే తెలిపారు. దేశ భవిష్యత్తుకు ఆయన అవసరం ఉందని అన్నారు.

**రాజకీయ పార్టీగా మారే ఉద్దేశం లేదు..**

సీజేపీకి రాజకీయ పార్టీగా మారే ఉద్దేశం లేదని మరోసారి చెప్పారు. రాజకీయంగా ఒత్తిడి తెచ్చే ప్రెషర్ గ్రూప్‌గా మాత్రమే కొనసాగుతామని చెప్పారు. ప్రభుత్వంలో జవాబుదారీతనం తేవడమే తన లక్ష్యమని అన్నారు. తాను రాజకీయ నాయకుడిగా మారనని కూడా చెప్పారు. నేటి పరిస్థితుల్లో అర్థవంతమైన మార్పులు ప్రజా ఉద్యమాలతోనే సాధ్యమని అన్నారు.

## విదేశీ ఉద్యోగాలకు టామ్‌కాం తోడు

(మొదటిపేజీ తరువాయి)

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో నూతన ఆవిష్కరణలకు అవసరమైన రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. జర్మనీ, జపనీస్, కొరియన్, చైనీస్, రష్యన్ తదితర భాషలు నేర్చుకునేందుకు వీలుగా స్కిల్ యూనివర్సిటీలో ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పాలన్నారు. విదేశీ భాషలు నేర్పేందుకు స్థానికంగా ఆ భాషలో పట్టున్న వారితో పాటు ఆయా దేశాలకు చెందిన శిక్షకులను రప్పించాలని సీఎం అన్నారు. యూనివర్సిటీ ప్రాంగణంలో రీలొకేటెడ్ చెట్లను నాటాలని సీఎం సూచించారు. ఉన్నత విద్యకు వెళ్లే విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చినట్లే, బ్లూ కాలర్ జాబ్‌లకు శిక్షణ పొందేవారందరికీ స్కాలర్‌షిప్‌లు ఇచ్చే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.
ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు, ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు పెద్ద కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఓ వైపు చదువుకుంటూనే, మరో వైపు ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా వారికి స్టైఫండ్ లభిస్తుందని, భవిష్యత్‌లో చేయబోయే ఉద్యోగానికి సంబంధించిన నైపుణ్యాలు నేర్చుకుంటారన్నారు. ఏటీసీల్లో EV సర్వీసులకు సంబంధించిన కోర్సులు, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెట్టాలని సీఎం సూచించారు. ఈవీల వాడకం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో వాటి సర్వీసింగ్ చేయగలిగిన వారు అవసరమన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం భారీగా పెరుగుతున్నందున డ్రోన్ టెక్నాలజీ కోర్సు ఉండాలని సీఎం సూచించారు.
దేశీయంగానూ, విదేశాల్లోనూ నర్సుల సేవలకు భారీ డిమాండ్ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పలు అభివృద్ధి చెందిన దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండడంతో ఇంటికో నర్సు డిమాండ్ ఉందన్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా నర్సింగ్ కళాశాలలకు అనుమతులు ఇస్తున్నట్లు సీఎం తెలిపారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.శ్రీధర్, శక్తి కార్యదర్శి హరిచందన, ఉపాధి, శిక్షణ డైరెక్టర్ నిర్మలా కాంతి వెస్లీ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



## నా భర్తను పొట్టనపెట్టుకున్నారు

**- పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రలో భార్య రోదనలు**
**- తరలివచ్చిన వేలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు**

న్యూఢిల్లీ, జులై 31, అనంతజనశక్తి న్యూస్



బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో నర్సంపేట మొత్తం శోకసంద్రంలో మునిగిపోయింది. సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అర్ధరాత్రి తుదిశ్వాస విడిచిన పెద్ది సుదర్శన్ రెడ్డి పార్థివ దేహాన్ని నర్సంపేటకు తరలించారు. ఆ తర్వాత నిర్వహించిన అంతిమయాత్రకు వేలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. పెద్ది సుదర్శన్ రెడ్డి.. అంతిమయాత్రలో పాల్గొన్న వారంతా కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇక ఆస్పత్రిలో తన భర్త చనిపోయినప్పటి నుంచి అంతిమయాత్ర వరకు పెద్ది సుదర్శన్ రెడ్డి భార్య పెద్ది స్వప్న.. గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఈ క్రమంలోనే అంతిమయాత్ర సమయంలో ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.
అంతిమయాత్ర జరుగుతుండగా.. పెద్ది సుదర్శన్ రెడ్డి భార్య సంచలన ఆరోపణలు చేశారు. తన భర్త మృతికి కారణమయ్యారంటూ ఎవరినో ఉద్దేశించి ఆమె రోదించారు. అంతిమయాత్ర వాహనంపై నుంచే ఆమె చేతులు చూపిస్తూ.. చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతోంది. అయితే పెద్ది సుదర్శన్ రెడ్డి 20162017లో సివిల్ సప్లైస్ ఛైర్మన్‌గా ఉన్న సమయంలో ఆయన తమను మోసం చేశారంటూ ఈ ఏడాది ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికల సమయంలో పలువురు తీవ్ర ఆరోపణలు చేశారు. అభివృద్ధి పనులు చేయించుకుని.. డబ్బులు ఇవ్వలేదని టెంట్ వేసుకుని మరీ నిరసన తెలిపారు. అయితే పెద్ది సుదర్శన్ రెడ్డి భార్య.. వారిని ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేశారా కాదా అనేది తేలాల్సి ఉంది.
పెద్ది సుదర్శన్ రెడ్డి పార్థివ దేహాన్ని అంతిమయాత్రకు తరలిస్తున్న వాహనంపై నిలబడిన పెద్ది స్వప్న.. తన భర్త ఇక లేరనే వార్తను జీర్ణించుకోలేక రోదించారు. 'లేవయ్యా.. నిన్ను చూసేందుకు వేలాది మంది జనం వచ్చారు చూడయ్యా' అంటూ ఆమె చేసిన ఆర్తనాదాలు అక్కడికి వచ్చిన వారందరినీ కంటతడి పెట్టేలా చేశాయి. నువ్వు లేకుండా నేను ఎలా ఉండాలి.. నేను ఉండలేను అంటూ ఆమె చేసిన రోదనలతో జనం తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. మరోవైపు.. పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల నర్సంపేట నియోజకవర్గంలోని దుకాణాలు, విద్యాసంస్థలు సంతాపం ప్రకటించాయి. నియోజకవర్గం వ్యాప్తంగా స్వచ్ఛందంగా మూసివేశారు.
పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్ర సందర్భంగా నర్సంపేట మెయిన్ రోడ్డుపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఎటు చూసినా ఆయన అభిమానులు కన్నీళ్లతో కనిపించారు. చిన్నా, పెద్దా, ముసలి అనే తేడాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలు తమ అభిమాన నాయకుడిని చివరి చూపు చూసేందుకు భారీ ఎత్తున తరలివచ్చారు. ఇక తమ అభిమాన నాయకుడు లేరు అంటూ వారు గుండెలు పగిలేలా విలపించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన పెద్ది సుదర్శన్ రెడ్డికి తుది వీడ్కోలు పలికేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని చాలా ప్రాంతాల నుంచి జనం పోటెత్తారు.



## బలప్రదర్శన యాత్ర విడ్డూరం

న్యూఢిల్లీ, జులై 31, అనంతజనశక్తి న్యూస్

**మంత్రి నిమ్మల రామానాయుడు**
**- పరామర్శ యాత్ర అనిపించలేదు**

ప్రపంచంలో ఎక్కడైనా చనిపోయిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించడం చూశాం గానీ, హత్య చేసిన వ్యక్తిని పరామర్శించడం వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కే చెల్లిందని ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఎద్దేవా చేశారు. శుక్రవారం కాకినాడ జిల్లాలోని అన్నవరంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇది పరామర్శ యాత్రగా కాకుండా, బలప్రదర్శన యాత్రగా మాజీ సీఎం జగన్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవ పండగ వాతావరణంలో ఉంటే.. వైఎస్ జగన్ ఓర్వలేనితనంతో అలజడులు సృష్టించాలని చూస్తున్నారని విమర్శించారు.
కూటమి ప్రభుత్వం నీరు పారించాలని చూస్తుంటే, గొడ్డలి పార్టీ రక్తాన్ని పారించాలని చూస్తోందని మంత్రి నిమ్మల మండిపడ్డారు. దారిన పోయే దానయ్య చనిపోతే నష్టమేంటని వైఎస్ జగన్ మాట్లాడుతున్నారని చెప్పారు. దానయ్యకు 45 ఏళ్ళు వచ్చాయి.. వయసైపోయిన వ్యక్తి చనిపోతే నష్టమేంటని ఆయన ప్రశ్నిస్తున్నారని అన్నారు. మరి 54 ఏళ్ళు వచ్చిన గొడ్డలి పార్టీ అధినేతకు కూడా వయసై పోయినట్లే కదా? అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. ఖాకీ డ్రెస్ అన్నా.. మహిళలన్నా గొడ్డలి పార్టీ నాయకుడికి గౌరవం లేదని విమర్శించారు. ఆడవాళ్ళ జోలికొస్తే అదే ఆఖరి రోజు అని సీఎం చంద్రబాబ వ్యాఖ్యలు.. గొడ్డలి పార్టీకి కూడా వర్తింపచేయాలని ఆయన డిమాండ్ చేశారు.
చనిపోయిన వ్యక్తిని కాదని, చంపిన వ్యక్తిని పరామర్శించడం సరికాదని.. మాజీ మంత్రి బొత్స లాంటి వారు కూడా జగన్‌కు ఎందుకు చెప్పలేకపోయారంటూ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని పాటిస్తామని ప్రమాణం చేసిన వ్యక్తి.. హత్య చేసిన వ్యక్తిని ఓదార్చడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఎర్ర బస్సు రాని ఊరికి, ఎయిర్ బస్ ఎందుకని నాడు జగన్ ప్రశ్నించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కోర్టులకు వెళ్లి మరీ భోగాపురం ఎయిర్ పోర్టు రాకుండా అడ్డుకుంటానని జగన్ చెప్పిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.
జగన్‌కున్న క్రెడిట్ చోరీ జబ్బును అందరికీ అంటించాలని చూస్తున్నాడని ఆరోపించారు. పోలవరం నుంచి 3 వేల టీఎంసీల నీరు వృధాగా సముద్రంలో కలసిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ధవళేశ్వరంకు ఎగువన నీటి నిల్వ కోసం, ఒక్క ప్రాజెక్టు కూడా లేకపోవడం చూసి సర్ ఆర్థర్ కాటన్ మనవరాలు ఆవేదన చెందారని చెప్పారు. నాడు చంద్రబాబు ప్రతి సోమవారాన్ని పోలవరంగా మార్చుకుని 72 శాతం ప్రాజెక్టు పనులు పూర్తి చేశారని వివరించారు. 2019లో ప్రభుత్వం మారకుండా ఉండి ఉంటే, 2024 నాటికి పోలవరం పూర్తయి అటు ఉత్తరాంధ్రకు, ఇటు రాయలసీమకు గోదావరి జలాలు వెళ్లి ఉండేవని అన్నారు.
ఒక్క ఛాన్స్ అంటూ గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చి పోలవరాన్ని ధ్వంసం చేసి, డయాఫ్రం వాల్‌ను విధ్వంసం చేశారని మండిపడ్డారు. నాడు ఇరిగేషన్ మంత్రులు, సీఎం, పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేమంటూ అసెంబ్లీలోనే చెప్పి, ఆ ప్రాజెక్టును ప్రశ్నార్థకం చేశారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు మొదటి పర్యటన పోలవరంకు వచ్చి 2027 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తయ్యేలా లక్ష్యంగా పెట్టారని వివరించారు. గత ప్రభుత్వంలో విధ్వంసం అయిన డయా ఫ్రం వాల్‌ను పూర్తి చేసి.. ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులను వేగవంతం చేశామని అన్నారు. పోలవరం పూర్తయ్యేలోగా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తీసుకెళ్లేలా నాడు చంద్రబాబు పురుషోత్తమపట్నం లిఫ్ట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు.
పురుషోత్తపట్నం లిఫ్ట్ ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంత సాగు, తాగునీటి అవసరాలతో పాటు పారిశ్రామిక అవసరాలకు నీరందిస్తున్నామని వివరించారు. 5 ఏళ్ళ గొడ్డలి పార్టీ పాలనలో పోలవరం ఎడమ కాలువ పనుల్లో తట్ట మట్టిగానీ, రూపాయి పని గానీ చేయలేదని వైసీపీని విమర్శించారు. తమ పాలనలో పోలవరం ఎడమ కాలువ పనుల వైపు కన్నెత్తి చూడని గొడ్డలి పార్టీకి ఉత్తరాంధ్ర గురించి మాట్లాడే నైతిక హక్కులేదన్నారు. జగన్ ఇరిగేషన్ శాఖలో రూ.18 వేల కోట్ల బకాయిలు వారసత్వంగా ఇచ్చి వెళ్లారంటూ వైఎస్ జగన్‌పై నిప్పులు చెరిగారు.
ఉత్తరాంధ్రకు న్యాయం చేయాలని రూ.1,800 కోట్లు ఖర్చు పెట్టి పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేస్తున్నామని ఆయన వివరించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పోలవరం ఎడమ కాలువలో ఉన్న క్లిష్టతరమైన పనులను రెండేళ్ళలోనే పూర్తి చేశామని ప్రకటించారు. ఆగస్టులోనే పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తీసుకెళ్లాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని వివరించారు. పోలవరం ఎడమ కాలువ పనుల జాప్యం నేపథ్యంలో ఏజెన్సీలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా అయితే చర్యలు తప్పవని అధికారులను మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు.

## నారా లోకేష్ అక్రమాలకు పాల్పడ్డారు

**- డీఎస్సీ పోస్టులు అమ్ముకున్నారు!**
**- వైసీపీ నేత అంబటి రాంబాబు**

న్యూఢిల్లీ, జులై 31, అనంతజనశక్తి న్యూస్



గుంటూరులో మెగా డీఎస్సీ నియామకాలపై మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. మెగా డీఎస్సీ నియామకాల్లో భారీ అక్రమాలు జరిగాయని, వాటిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరుతూ గుంటూరు జాయింట్ కలెక్టర్‌కు వైసీపీ నేతలతో కలిసి వినతిపత్రం సమర్పించారు. డీఎస్సీ నియామకాల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే కుట్రపూరిత ప్రణాళికతో వ్యవహరించిందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అక్రమాలకు పాల్పడ్డారని, స్పోర్ట్స్ కోటా ఉద్యోగాలను తనకు కావాల్సిన వాళ్లకు ఇచ్చుకున్నారని అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ.. 'మెగా డీఎస్సీలో మొత్తం 441 పోస్టుల నియామకాల్లో అక్రమాలు జరిగాయి. స్పోర్ట్స్ కోటాలోని కొన్ని పోస్టులను అక్రమంగా కేటాయించారు. మరికొన్ని పోస్టులు డబ్బులు తీసుకుని అమ్ముకున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు అనుకూలంగా ఉండే అభ్యర్థులకు లబ్ధి చేకూర్చేందుకే స్పోర్ట్స్ కోటా నిబంధనలను మార్చారు. పరీక్ష నిర్వహణకు ముందు అమల్లో ఉన్న జీవోను రద్దు చేసి.. కొత్త జీవో తీసుకొచ్చారు. నియామకాలు పూర్తైన తర్వాత మళ్లీ పాత జీవోను పునరుద్ధరించారు. దీనిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు.
'స్పోర్ట్స్ కోటా విషయంలో సాధారణంగా 2 శాతం రిజర్వేషన్ ఉండాల్సి ఉండగా.. దానిని 3 శాతానికి పెంచారు. అంతేకాకుండా స్పోర్ట్స్ కోటా అభ్యర్థులు డీఎస్సీ పరీక్ష రాయాల్సిన అవసరం లేదని జీవోలో మార్పులు చేశారు. ఈ మార్పుల వల్ల కొందరికి అన్యాయం జరిగింది. నవీన్ అనే అభ్యర్థికి ఉద్యోగం రాకపోవడంతో కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. ఈ మొత్తం వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలి. డీఎస్సీ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలి. చర్చల పేరుతో అసలు సమస్యను ప్రభుత్వం పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తోంది. పరీక్షకు ముందు, తర్వాత జీవోలను మార్చడం వెనుక ఉన్న కారణాలను ప్రభుత్వం ప్రజలకు వివరించాలి' అని అంబటి రాంబాబు ఫైర్ అయ్యారు. అలాగే ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రతి ఏడాది నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేసిన అంబటి రాంబాబు.. అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా నిరుద్యోగులకు తగిన ఉద్యోగాలు కల్పించలేదని ఆరోపించారు. నిరుద్యోగ భృతి కూడా అమలు చేయలేదని విమర్శిస్తూ.. ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేశారని అన్నారు. మెగా డీఎస్సీ నియామకాలపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి, నిజాలు వెలుగులోకి తీసుకురావాలని అంబటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఎక్సైజ్ వాహనాల వేలంలో పారదర్శకత ఏదీ?

- స్థానిక మీడియాకు సమాచారం ఇవ్వకపోవడంపై అభ్యంతరం
- అందరికీ సమాన అవకాశం కల్పించాలి.. సామాజిక సేవకుడు కర్నే బాబురావు

మణుగూరు, జూలై 31: (అనంత జనశక్తి)



ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్న వాహనాల వేలం ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని సామాజిక సేవకుడు కర్నే బాబురావు డిమాండ్ చేశారు. వేలానికి సంబంధించిన సమాచారాన్ని ప్రజలు, స్థానిక మీడియాకు ముందుగానే అందించి ప్రతి అర్హుడికీ సమాన అవకాశం కల్పించాలని కోరారు. మణుగూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన వాహనాల వేలానికి సంబంధించిన సమాచారం స్థానిక మీడియాకు సకాలంలో అందలేదనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయని బాబురావు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో పత్రికలు, టెలివిజన్, డిజిటల్ మీడియా కీలక పాత్ర పోషిస్తున్నాయని, అలాంటి స్థానిక మీడియాకు వేలం వివరాలు అందించకపోవడం బాధాకరమన్నారు. వేలం తేదీ, సమయం, నిబంధనలు, వేలానికి ఉంచే వాహనాల వివరాలను ముందుగానే విస్తృతంగా ప్రకటించాల్సిన అవసరం ఉందన్నారు. కొందరికే సమాచారం అందుతోందనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడితే వేలం ప్రక్రియ పారదర్శకతపై అనుమానాలకు తావిస్తుందని పేర్కొన్నారు. గతంలో నిర్వహించిన వేలాల సమయంలోనూ సమాచారం విషయంలో ఇదే తరహా పరిస్థితులు ఎదురయ్యాయనే విమర్శలు ఉన్నాయని బాబురావు తెలిపారు. ప్రభుత్వ వేలంలో పాల్గొనేందుకు అర్హులైన వారందరికీ సమాచారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

**'అపోహలకు తావివ్వొద్దు'**

ప్రభుత్వ వేలంపాటలపై ప్రజల్లో ఎలాంటి అపోహలు, అనుమానాలు తలెత్తకుండా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని బాబురావు కోరారు. ఈ అంశంపై జిల్లా ఎక్సైజ్ అధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులను వెల్లడించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో వేలం తేదీలు, సమయం, నిబంధనలు, వాహనాల వివరాలను ముందుగానే అధికారికంగా ప్రకటించి స్థానిక మీడియాతో పాటు అన్ని వర్గాలకు ఒకేసారి సమాచారం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.

# ప్రధాన రహదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, జులై 31 (అనంత జనశక్తి )

గోదావరి వరద ఉద్ధృతి నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం సాయంత్రం సారపాక -రెడ్డిపాలెం, తూర్పాక -దుమ్ముగూడెం ప్రధాన రహదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గోదావరి నీటి మట్టం మరింత పెరిగితే సారపాక -రెడ్డిపాలెం ప్రధాన రహదారిపై వరద నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల భద్రత దృష్ట్యా అవసరమైతే వెంటనే బ్యారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలు, ప్రజలు ఎవరూ ఆ మార్గంలో ప్రయాణించకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.అనంతరం తూరుబాక -దుమ్ముగూడెం ప్రధాన రహదారిని పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఆ మార్గంపై ఇప్పటికే వరద నీరు చేరడంతో రాకపోకలను నిలిపివేసి రహదారిని మూసివేసినట్లు అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. రహదారి వద్ద ఏర్పాటు చేసిన బ్యారికేడ్ల వద్ద నిరంతరం పోలీసు బందోబస్తు కొనసాగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు వరద నీటిలో ప్రయాణించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలను వెంటనే అమలు చేయాలని, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.

# ఘనంగా ఏ ఎస్ఐల 32 సంవత్సరాల వేడుక

- ఆదర్శప్రాయం పుల్లయ్య,మహమ్మద్ అలీల సేవలు
- నాగార్జున సాగర్ ఆర్ఐ శ్రీనివాసరావు

నాగార్జునసాగర్,జులై 31 అనంత జనశక్తి న్యూస్



నాగార్జున సాగర్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ విభాగంలో 1994 బ్యాచ్ ఏఎస్ఐలుగా 32 సంవత్సరాల సేవలను విజయవంతంగా పూర్తి చేసుకున్న పుల్లయ్య, మహమ్మద్ అలీలను ఘనంగా సన్మానించారు. శుక్రవారం నాగార్జున సాగర్ ఎస్పీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎస్పీఎఫ్ ఆర్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు,ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీఎఫ్ ఆర్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒక ఉద్యోగంలో మూడు దశాబ్దాలకు పైగా అంటే 32 సంవత్సరాల పాటు ఎలాంటి వివాదాలకు తావులేకుండా,క్రమశిక్షణ తో విధులు నిర్వర్తించడం మామూలు విషయం కాదు.1994 బ్యాచ్‌కి చెందిన మన ఏఎస్ఐలు పుల్లయ్య,మహమ్మద్ అలీలు ఎస్పీఎఫ్ శాఖకు అందించిన సేవలు ఎంతో ఆదర్శప్రాయం.వృత్తిపట్ల వారి అంకితభావం,నిబద్ధత యువ సిబ్బంది అందరికీ స్ఫూర్తిదాయకం. వారు భవిష్యత్తులోనూ ఇలాగే ఆరోగ్యంగా,మరిన్ని మంచి సేవలు అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అభినందించా రు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు పుల్లయ్య,మహమ్మద్ అలీలతో కేక్ కట్ చేయించి తోటి సిబ్బంది అంతా వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గోదావరికి రెండో ప్రమాద హెచ్చరిక

- 48 అడుగులకు చేరిన నీటిమట్టం.. దిగువకు 11.44 లక్షల క్యూసెక్కులు
- లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు
- భద్రాచలంలో వరద పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, జూలై 31 (అనంత జనశక్తి):

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. భద్రాచలం వద్ద శుక్రవారం నీటిమట్టం 48 అడుగులకు చేరడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. 11,44,645 క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవహిస్తోంది. నీటి మట్టం 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు.

వరద ఉద్ధృతి నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. విస్తా కాంప్లెక్స్ స్లూయిస్ వద్ద వరద నీటి పారుదల, మోటార్ల పనితీరుపై ఇరిగేషన్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నీరు వేగంగా బయటకు వెళ్లేలా మోటార్లను నిరంతరం నడపాలని, సాంకేతిక లోపాలు తలెత్తకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం కరకట్టపై నుంచి గోదావరి వరద ఉద్ధృతిని పరిశీలించి, స్నానఘాట్ల వద్ద పరిస్థితిని సమీక్షించారు. ప్రజలను ఎట్టి పరిస్థితుల్లోనూ గోదావరిలోకి అనుమతించవద్దని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లో నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. కూనవరం-భద్రాచలం ప్రధాన రహదారిపై వరద నీరు చేరుతున్న ప్రాంతాల వివరాలను తెలుసుకుని, రాకపోకలకు అంతరాయం కలిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**పునరావాస కేంద్రాలు సిద్ధం**

లోతట్టు ప్రాంతాల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని కలెక్టర్ అంకిత్ తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో ప్రజలను ఆలస్యం చేయకుండా పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు సిద్ధంగా ఉంచామన్నారు. కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, విద్యుత్, పారిశుధ్యం, వైద్య సేవలతోపాటు మహిళలు, చిన్నారులు, వృద్ధులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారుల4ను ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్య, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు.

**24 గంటలూ కంట్రోల్ రూమ్**

వరద బాధితుల సహాయార్థం భద్రాచలం ఫ్లడ్ కంట్రోల్ రూమ్ 24 గంటలూ పనిచేస్తోందని కలెక్టర్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 08744 241950కు ఫోన్ చేయాలని లేదా 9392919743 వాట్సాప్ నంబర్‌కు సమాచారం పంపాలని సూచించారు. వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్నే విశ్వసించాలని కోరారు.

అనంతరం ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ వరద ఉద్ధృతి అధికంగా ఉన్నందున ప్రజలు గోదావరిలోకి దిగరాదని హెచ్చరించారు. సెల్ఫీలు, వీడియోల కోసం ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్ లేదా 100 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. పరిశీలనలో ఇరిగేషన్ ఎస్సీ మహేశ్వరరావు, దేవస్థానం ఈవో దామోదర్‌రావు, భద్రాచలం తహసీల్దార్ రామకృష్ణ, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్‌తో పాటు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భద్రాచల పుణ్యక్షేత్ర ఆలయ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

-వరదల నేపథ్యంలో నిర్మాణ పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, జూలై 31 (అనంత జనశక్తి ):



భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పరిసరాల్లో కొనసాగుతున్న ఆలయ నిర్మాణ పనులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, ప్రస్తుతం కొనసాగుతున్న పనులు, గోదావరి వరదల నేపథ్యంలో తీసుకుంటున్న భద్రతా చర్యల గురించి సంబంధిత అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకుని సమీక్ష నిర్వహించారు.

గోదావరి నీటి మట్టం పెరుగుతున్న నేపథ్యంలో నిర్మాణ పనుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే నిర్మాణ సామగ్రి, యంత్రాలు, విద్యుత్ పరికరాలను భద్రంగా ఉంచడంతో పాటు వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రాచలానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు, అత్యవసర మార్గాలను అందుబాటులో ఉంచడం, రద్దీ ప్రాంతాల్లో పోలీసు బందోబస్తును మరింత పటిష్ఠం చేయడం, నిర్మాణ పనుల వల్ల వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయడం వంటి అంశాలపై కూడా సంబంధిత అధికారులతో సమీక్షించారు. వరద పరిస్థితుల దృష్ట్యా ట్రాఫిక్ మళ్లింపు అమలు చర్యల గురించి ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. భక్తులు, ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, ఆలయ అధికారులు, పోలీసు శాఖ, ఇతర సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో దామోదర్ రావు, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీఐ నాగరాజు, ఆలయ నిర్మాణ అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పీకే ఓసీ డీప్‌సైడ్ బ్లాక్ సింగరేణికే కేటాయించాలి

- 'సేవ్ మణుగూరు–సేవ్ సింగరేణి' నినాదంతో భారీ ధర్నా, రాస్తారోకో
- అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు.. పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తాం: ఏఐటీయూసీ

మణుగూరు, జూలై 31: (అనంత జనశక్తి



): మణుగూరు ప్రాంత భవిష్యత్తు, సింగరేణి మనుగడను దృష్టిలో ఉంచుకుని పీకే ఓసీ డీప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బ్లాక్‌ను జెన్‌కోకు అప్పగించే ప్రయత్నాలను విరమించుకోవాలని, లేదంటే కార్మికులు, ప్రజలను కలుపుకొని పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. పీకే ఓసీ డీప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలనే డిమాండ్‌తో మణుగూరు బండారుగూడెం సీపీఐ కార్యాలయ కూడలిలో శుక్రవారం ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో భారీ ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని 'సేవ్ మణుగూరు-సేవ్ సింగరేణి' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ సింగరేణి భవిష్యత్తుతోనే మణుగూరు ప్రాంత మనుగడ ముడిపడి ఉందన్నారు. సింగరేణి, జెన్‌కో రెండూ ప్రభుత్వ సంస్థలే అయినప్పటికీ సింగరేణికి దక్కాల్సిన బొగ్గు బ్లాక్‌ను జెన్‌కోకు అప్పగించే ప్రయత్నం సరికాదన్నారు. సింగరేణిని బలోపేతం చేస్తామని చెబుతూనే మరోవైపు సంస్థ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించడం తగదన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం సింగరేణి విషయంలో ఒకే విధానాన్ని అనుసరిస్తున్నాయని విమర్శించారు. సింగరేణికి రావాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిలను చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. సంస్థకు కేటాయించాల్సిన బొగ్గు బ్లాకులను ఇతరులకు అప్పగిస్తే సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు.

**'లాఠీలకు భయపడేది లేదు'**

ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య మాట్లాడుతూ మణుగూరు ఉనికి, మనుగడ, భవిష్యత్తుతో ముడిపడిన ఈ సమస్యపై వెనక్కి తగ్గేది లేదన్నారు. ప్రజల ఆకాంక్షలను పట్టించుకోకుండా ఉద్యమాలను అణచివేసేందుకు ప్రయత్నిస్తే మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ, ఏఐటీయూసీతో పాటు ఇతర రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలను కలుపుకొని పోరాటాన్ని విస్తరిస్తామన్నారు. లాఠీలు, అరెస్టులకు భయపడేది లేదని స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్య పద్ధతిలో చేపట్టిన ఆందోళనను అడ్డుకునేందుకు పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించడంపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల గొంతును పోలీసులతో అణచివేయాలని చూస్తే ఉద్యమాలు ఆగవని పేర్కొన్నారు. పీకే ఓసీ డీప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికి కాకుండా జెన్‌కోకు కేటాయించే ప్రక్రియ భవిష్యత్తులో ప్రైవేటీకరణకు దారితీసే ప్రమాదం ఉందని ఏఐటీయూసీ నాయకులు అనుమానం వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికుల ఉద్యోగ భద్రత, మణుగూరు ప్రాంత ప్రజల జీవనాధారాన్ని కాపాడటమే తమ లక్ష్యమని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పీకే ఓసీ డీప్‌సైడ్ బ్లాక్ సింగరేణికే దక్కేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జెన్‌కో టెండర్ ప్రక్రియ నుంచి తప్పుకునేలా చూడాలని కోరారు. స్పందించకపోతే 'చలో హైదరాబాద్'కు పిలుపునిచ్చి సింగరేణి వ్యాప్తంగా మహోద్యమం చేపడతామని హెచ్చరించారు. ఆందోళనలో పాల్గొన్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ సహా పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, సింగరేణిని కాపాడే వరకు పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్, ఉపాధ్యక్షుడు రామ నర్సయ్య, సహాయ కార్యదర్శి మేకల ఈశ్వరరావు, ఆవుల నాగరాజు, ఆదెర్ల సురేందర్, బి.సురేందర్‌రావు, శనిగరపు కుమారస్వామి, ఆడెపు రాజశేఖర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు మున్నా లక్ష్మీకుమారి, జంగం మోహన్‌రావు, సీపీఐ మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, పట్టణ కార్యదర్శి దుగ్యాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం జలకళ.నాగార్జునసాగర్‌పై ఆశలకల



- ఎగువ ప్రాంతాల ప్రాజెక్టులు నిండుకుండ
- ఆగస్టులో పూర్తిస్థాయికి నీటి మట్టానికి చేరే అవకాశం
- ఆనందంలో ఆయకట్టు రైతులు, స్థానిక ప్రజలు

నాగార్జునసాగర్ జులై 31 అనంత జనశక్తి న్యూస్

ఎగువ ప్రాంతాల ప్రాజెక్టులు పూర్తిగా నిండటంతో, కృష్ణా జలాల ప్రధాన ప్రాజెక్టులైన శ్రీశైలం ప్రాజెక్టు ప్రస్తుతం జలకళను సంతరించుకుంది.ఈ నేపథ్యంలో దిగువన ఉన్న నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు కూడా ఆగస్టు నెలలోనే పూర్తిస్థాయి నీటి నిల్వ చేరుకుంటుందని స్థానిక ప్రజలు, ఆయకట్టు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.గత కొన్ని రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలు మరియు ప్రాజెక్టుల నుంచి వస్తున్న ప్రవాహంతో శ్రీశైలం జలాశయం జలకళను సంతరించుకుంది,త్వరలోనే నాగార్జున సాగర్ ప్రాజెక్టు కూడా నిండే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి,సాగర్ ప్రాజెక్ట్ సకాలంలో నిండితే ఖరీఫ్ సీజన్‌కు ఎలాంటి ఢోకా ఉండదని, సాగు నీరు సమృద్ధిగా అందుతుందని ఆయకట్టు రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు,ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న నీటి పరిస్థితులు మరియు ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహాన్ని బట్టి చూస్తే,ఆగస్టు



నాటికి సాగర్,జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుం టుందని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ప్రాజెక్టులో ప్రస్తుతం డెడ్ స్టోరేజ్ కి మూడు అడుగులు మాత్రమే ఉంది,ప్రకృతి కరుణించడంతో కృష్ణా తీర ప్రాంతం మరోసారి పచ్చదనంతో కళకళలాడనుందని,అన్నదాతలు చిరునవ్వులు వెల్లివిరుస్తాయని ఈ ప్రాంత ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నాగార్జున సాగర్ జలాశయంలో నీటి మట్టం శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 513.10 అడుగుల మేర నీరు నిల్వ ఉంది.ప్రాజెక్టు మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా,ప్రస్తుతానికి 136.9932,టీఎంసీ ల నీరు నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు యంత్రాంగం పేర్కొంది.ప్రస్తుతం ప్రాజెక్టు పరిస్థితిని పరిశీలిస్తే,ఎగువ నుంచి ప్రాజెక్టులోకి 900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా,అదే స్థాయిలో 900 క్యూసెక్కు ల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

శనివారం | రంగారెడ్డి
01.08.2026
అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం






# ఆడవారి ప్రైవేట్ భాగాల్లో వచ్చే దురదని తగ్గించే చిట్కా, ఇంట్లోని పదార్థాలతోనే ప్రాబ్లమ్ సాల్వ్

మహిళలు వెజైనా ప్రాంతంలో దురద, చికాకు వంటి సమస్యలను ఎక్కువగా ఎదుర్కొంటూ ఉంటారు. ఏదో ఒక సమయంలో ప్రతి మహిళలు.. యోని ప్రాంతంలో చికాకు, దురదను అనుభవిస్తూ ఉంటారు. నలుగురిలో ఉంటే.. ఇంకా చికాకుగా ఉంటుంది. వెజైనా దగ్గర దురద, మంట అంటే అత్యంత సాధారణమైన కారణం వెజైనల్ఇన్ఫెక్షన్. ఇది ఫంగస్వల్ల కానీ ట్రైకోమోనాస్వల్ల కానీ లేదా బ్యాక్టీరియా వల్ల కానీ వస్తుండచ్చు. లేదా ఒక్కోసారి డెర్మటైటిస్వంటి చర్మ వ్యాధులు, అలర్జీలు కూడా ఇందుకు కారణం కావచ్చు. పీరియడ్స్టైమ్లో ఉపయోగించే.. కెమికల్స్తో కూడిన శానిటరీ ప్యాడ్ల వల్ల కూడా చికాకు సంభవించవచ్చు. కొన్ని హోంరెమిడీస్తో వెజైన ప్రాంతంలో చికాకు, దురదను తగ్గించుకోవచ్చు.









**యాపిల్ సైడర్ వెనిగర్ వాడండి చూడండి**

ఆపిల్ సైడర్ వెనిగర్లో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఉంటాయి. ఇవి బాక్టీరియల్, ఫంగల్ ఇన్ఫెక్షన్ వల్ల కలిగే చికాకును పూర్తిగా దూరం చేస్తాయి. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీళ్లలో రెండు చెంచాల యాపిల్సైడర్వెనిగర్వేసి.. మీ యోని ప్రాంతాన్ని శుభ్రం చేసుకోండి. వెజైనా.. ఎసిడిక్గా మారుతుంది.. దీంతో బ్యాక్టీరియా దూరం అవుతుంది.

**కోల్డ్ కంప్రెస్ హెల్ప్అవుతుంది**

రాత్రిపూట వెజైనా చికాకు ఎక్కువగా ఉంటుంది.. దీంతో మీ నిద్రకు కూడా భంగం కలిగే అవకాశం ఉంది. మీ వెజైనా ఏరియాలో కోల్డ్కంప్రెస్ఉంచండి.. ఇంది చికాకు, దురద నుంచి ఉపశమనం ఇస్తుంది.

**ఉప్పు నీళ్లతో శుభ్రం చేసుకోండి**

ఉప్పు బ్యాక్టీరియాను చంపుతుంది.. దురద చికాకును దూరం చేస్తుంది. మీరు వెజైనా దురద కారణంగా బాధపడుతుంటే.. ఉప్పు నీళ్లతో మీ యోని ప్రాంతాన్ని శుభ్రం చేసుకోండి. ఇది వెజైనా చికాకు నుంచి త్వరాగా ఉపశమనం కలిగిస్తుంది. బ్యాక్టీరియా పెరిగే అవకాశాన్ని తగ్గిస్తుంది.


**వెల్లుల్లి పేస్ట్ మంచిది**

వెల్లుల్లిలో యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి, ఇవి యోని చికాకు, దురద నుంచి ఉపశమనం ఇస్తాయి. వెల్లుల్లిని పేస్ట్గా తయారు చేసి.. మీ వెజైనా ఏరియాకు అప్లై చేయండి.

**పెరుగు వాడండి**

పెరుగులో యాక్టివ్కల్చర్ఉంటుంది. దీనిలో మంచి బ్యాక్టీరియా.. చెడు బ్యాక్టీరియాను తొలగిస్తాయి. రోజూ ఒక కప్పు పెరుగును మీ డైట్లో తీసుకోండి. మీ యోని ప్రాంతంలో కూడా.. పెరుగును అప్లై చేసినా మంచి రిజల్ట్స్ ఉంటాయి.

# ఎంత ట్రై చేసినా బరువు తగ్గట్లేదా? ఎలాంటి తప్పులు చేస్తున్నారో చెక్ చెసుకోండి





బరువు తగ్గాలని చాలా మంది అనుకుంటారు. కానీ, కొంతమంది మాత్రమే ఆ టార్గెట్ రీచ్ అవుతూ ఉంటారు. మరికొందరికి కఠినమైన డైట్స్ పాటించినా, జిమ్లో గంటల తరబడి కష్టపడినా ఫలితం కనిపించదు. దీనికి పెద్దపెద్ద కారణాలే ఉండనవసరం లేదు, మనం నిర్లక్ష్యం చేసే చిన్న చిన్న అలవాట్లే వెయిట్ లాస్ జర్నీకి అడ్డుగా మారతాయి. ఈ అలవాట్లు మెటబాలిజాన్ని మందగించడమే కాకుండా శరీరంలో కొవ్వును నిల్వ చేస్తాయి, మనకు రోజంతా ఆకలిగా అనిపించేలా చేస్తాయి. మీరు ఎంత ప్రయత్నించినా బరువు తగ్గకపోతుంటే.. మొదట ఈ తప్పులను తెలుసుకుని వాటిని మానుకుంటే మంచిది. దీంతో మీరు కేవలం బరువు తగ్గడమే కాదు.. శక్తి స్థాయిలు పెరుగుతాయి, దీర్ఘకాలిక అనారోగ్యాల ముప్పు దూరం అవుతుంది.





**మీ ఆహారంలో ప్రోటీన్ లేకపోవడం**

బరువు తగ్గడంలో ప్రోటీన్ కీలక పాత్ర పోషిస్తుంది. ప్రొటీన్ ఎక్కవసేపు మీ కడుపు నిండుగా ఉండేలా చేస్తుంది, ఆకలిని కంట్రోల్లో ఉంచుతుంది. క్యాలరీ ఇన్టేక్ను పరిమితం చేస్తునే లీన్ కండర ద్రవ్యరాశిని రక్షిస్తుంది. మీ ఆహారంలో ప్రొటీన్ సమృద్ధిగా తీసుకుంటే శరీర జీవక్రియ రేటు పెరుగుతుంది, బరువు పెరగకుండా కంట్రోల్లో ఉంటుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్ ప్రకారం, మన ఆహారంలో తగినంత ప్రొటీన్ తీసుకుంటే కొవ్వు త్వరగా కరుగుతుంది. మీ ఆహారంలో గుడ్లు, చేపలు, పాల ఉత్పత్తులు, చిక్కుళ్లు వంటి ఆహార పదార్థాలను తీసుకోండి.

**ఫైబర్ తక్కువగా తింటున్నారా?**

జీర్ణక్రియను మెరుగుపరచడానికి, ఆకలిని తగ్గించడానికి ఫైబర్ చాలా అవసరం. ఫైబర్ తక్కువగా తీసుకుంటే మీ వెయిట్ లాస్ జర్నీని లేట్ చేస్తాయి. అంతేకాదు పేగు ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. మీ ఆహారంలో తృణధాన్యాలు, అవిసె గింజలు, సబ్జా గింజలు, గుమ్మడికాయ గింజలు, మెంతులు, వేరుశనగలు, పొద్దుతిరుగుడు విత్తనాలు, బీన్స్, బఠానీలు, అవకాడో, పండ్లు చేర్చుకోండి.

**బ్రేక్ఫాస్ట్ స్కిప్ చేస్తున్నారా?**

చాలామంది తిండి మానేస్తే.. బరువు తగ్గుతాం అనే అపోహలో ఉంటారు. దీంతో బ్రేక్ఫాస్ట్ మానేస్తూ ఉంటారు. అయితే ఇది మంచి ఆలోచన కాదని నిపుణులు అంటున్నారు. ఉదయం పూట టిఫిన్ మానస్తే ఆ తర్వాత ఆకలి పెరుగుతుంది, రోజంతా ఆకలిగా అనిపిస్తుంది కడుపు మాడితే, ఏది పడితే అది నోటిలోకి వెళ్లిపోతుంది. మీరు బరువు తగ్గాలనుకుంటే ప్రొటీన్, ఫైబర్తో కూడిన సమత్యల ఆహారం తీసుకోండి.

**బ్లడ్ షుగర్స్ను కంట్రోల్లో ఉంచుకోకపోతే**


రక్తంలో చక్కెర స్థాయిలు అస్థిరంగా ఉండటం వల్ల బరువు తగ్గడం కష్టమవుతుంది. బ్లడ్ షుగర్స్ ఎక్కువగా ఉంటే ఆకలి ఎక్కువగా వేస్తుంది, అతిగా తింటారు, శరీరంలో కొవ్వు నిల్వలు పెరుగుతాయి. కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, సమతుల్య ఆహారం తీసుకుంటే బ్లడ్ షుగర్స్ కంట్రోల్లో ఉంటాయి.

**తగినంత నిద్ర లేకపోయినా**

నిద్రసరిగ్గా లేకపోయినా.. మీరు బరువు తగ్గడం కష్టం అవుతుంది. నిద్ర సరిగ్గా లేకపోతే.. ఆకలి, సంతృప్తిని నియంత్రింతే హార్మోన్లకు అంతరాయం కలిగిస్తుంది. దీంతో ఆకలి పెరుగుతుంది, జీవక్రియను నెమ్మదిస్తుంది. మీరు త్వరగా బరువు తగ్గాలంటే.. 7-9 గంటలు ప్రశాంతంగా నిద్రపోండి.

**వ్యాయామం తక్కువ చేసినా, అతిగా చేసినా కూడా**

వ్యాయామం అవసరమే కానీ మితిమీరి చేసినా, అసలు చేయకపోయినా కూడా ప్రతికూల ఫలితాలు వస్తాయి. వ్యాయామం చేయకపోతే.. కండరాల నష్టం జరుగుతుంది, జీవక్రియ తగ్గుతుంది.. దీంతో బరువు పెరుగుతారు. అతిగా వ్యాయామం చేసినా... ఒత్తిడి, అలసట కారణంగా బరువు పెరుగుతారు. కార్డియో, స్ట్రెంథ్ ట్రైనింగ్ వంటి వ్యాయామాలు కచ్చితంగా మీ డైలీ రొటీన్లో చేర్చుకోండి.



# సినిమా షూటింగ్‌లో రష్మికకు గాయాలు



సినీ నటి రష్మిక మందన్న గాయపడ్డారు. సినిమా షూటింగ్‌లో భాగంగా ఓ పాటకు డ్యాన్స్ చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. తుంటి భాగంలో బలమైన గాయమైనట్లు వైద్యులు గుర్తించారు. ఆరు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వారు సూచించారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో ఆమె నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా'. కథానాయిక ప్రాధాన్యమున్న ఈ చిత్రంలో రష్మిక గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న 'మైసా'కు సంబంధించి కీలక యాక్షన్ సన్నివేశాలతో పాటు, అండర్ వాటర్ సీక్వెన్స్‌ను ఇటీవల పూర్తి చేశారు. తాజాగా ఓ పాటను షూట్ చేస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మరోవైపు విజయ్ దేవరకొండతో కలిసి రష్మిక 'రణబాలి'లో నటిస్తున్నారు. రాహుల్ సాంకృత్యన్ దర్శకుడు. ఈ ఏడాది సెప్టెంబరు 11న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

**టాలీవుడ్‌ను వెంటాడుతున్న గాయాలు**

ఈ ఏడాది తెలుగు సినీ నటులు వరుసగా గాయాల పాలవుతున్నారు. ఇటీవల అగ్ర కథానాయకుడు బాలకృష్ణ #NBK111 షూటింగ్‌లో గాయపడగా, ఆయనకు వైద్యులు ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం బాలకృష్ణ కోలుకుంటున్నారు. మరోవైపు అబ్బాయి ఎన్టీఆర్ భుజానికి కూడా గాయమైంది. ఆయన గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి ఆరు నుంచి ఎనిమిది వారాల విశ్రాంతి అవసరమని వైద్య బృందం సూచించింది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ 'డ్రాగన్' చేస్తున్నారు. 'పెద్ది' షూటింగ్‌లో రామ్‌చరణ్ మణికట్టుకు గాయమవగా, ఇటీవల కోయంబత్తూర్తు వెళ్లి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో చిరంజీవి కూడా చేతికి బెల్ట్‌తో కనిపించారు. గత కొంతకాలంగా భుజం గాయంతో బాధపడుతున్న ఏపీ డిప్యూటీ సీఎం, సినీ నటుడు పవన్‌కల్యాణ్ ఇటీవల ముంబయిలో శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే.


**విడుదల మరింత ఆలస్యం..**

ఒక కథానాయకుడు/నాయిక గాయపడటం వాళ్లు పనిచేస్తున్న సినిమాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. రష్మిక ప్రస్తుతం నాలుగు ప్రాజెక్టులు చేస్తున్నారు. అన్నీ భారీ బడ్జెట్ చిత్రాలే. సెప్టెంబరు 11న 'రణబాలి' విడుదల తేదీని ప్రకటించారు. మరి ఆమెకు సంబంధించిన షూట్ పూర్తయిందో లేదో స్పష్టత రావాల్సి ఉంది. బాలకృష్ణ #NBK111 విడుదల కూడా ఆలస్యం కానుంది. చరణ్ కూడా పూర్తిగా కోలుకున్న తర్వాతే సుకుమార్ మూవీ సెట్స్‌లో అడుగు పెట్టనున్నారు.

# నాలో ఆత్మవిశ్వాసం నింపిన క్షణం: ప్రీతి ముకుందన్

తాను నటనని కెరీర్‌గా ఎంచుకోవడానికి తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణమని అంటోంది అందాల తార ప్రీతి ముకుందన్. ఇటీవల 'బ్లాస్ట్', 'హృదయం మురళీ'లాంటి చిత్రాలలో వైవిధ్యమైన పాత్రల్లో కనిపించి ఆకట్టుకుంది ప్రీతి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన మొదటి ఆడిషన్‌కు సంబంధించిన ఓ ఆసక్తికర సంగతిని పంచుకుంది. "మా ఫ్యామిలీలో అందరం చదువుపైనే ఎక్కువ దృష్టి పెట్టే వాళ్లం. మా వాళ్లు చదువులో నన్ను ఎంతగా ప్రోత్సహించేవారో.. నేను నా మనసుకు నచ్చినట్టు కూడా నడుచుకోవాలని అంతే పట్టుదలతో ఉండేవారు. అందుకే కెరీర్ ప్రారంభంలో కొంత కాలం మోడలింగ్ చేశాను. 18 ఏళ్ల వయసులోనే నాకు ఓ చిత్రంలో నటించే అవకాశం వచ్చింది.

అప్పుడు నటనపై నాకంత నమ్మకం లేక ఆడిషన్ ఇవ్వలేనని చెప్పేశా. కానీ మా అమ్మానాన్న 'నువ్వు ఇది ఎందుకు ప్రయత్నించకూడదు?' అని ఆడిషన్‌కు వెళ్లమని ప్రోత్సహించారు. దాంతో ఆడిషన్‌లో నా వంతు నేను ప్రయత్నించాను కానీ, ఆ పాత్ర దక్కలేదు. కానీ నా తల్లిదండ్రులు నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపిన క్షణమది. చిత్రపరిశ్రమ ఓ కొత్త ప్రపంచం. మా వాళ్లకి దాని గురించి ఏ మాత్రం తెలియదు కానీ, మనసుకి నచ్చింది చేయమని చెప్పడంతోనే నా ప్రయాణం మొదలైంది. ఆ తర్వాతే నెమ్మదిగా నటన పట్ల అభిరుచి పెరిగి, సినిమాని ప్రేమించడం మొదలు పెట్టాన"ని అంది.



# మిస్టరీ థ్రిల్లర్‌కు హారర్ మేళవింపుగా జాక్వెలిన్ చిత్రం?

వైవిధ్యమైన పాత్రల్లో గ్లామర్‌కు నటనను జోడించి.. మరోవైపు కుర్రకారుని ఉర్రూతలూగించే ప్రత్యేక గీతాలతో ఆకట్టుకుంటుంది అందాల తార జాక్వెలిన్ ఫెర్నాండెజ్. ఈ మధ్యే 'వెల్‌కమ్ టు ది జంగిల్'లో కనిపించి ప్రేక్షకుల్ని అలరించింది. జాక్వెలిన్ ఓ హారర్ జానర్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లుగా ఇటీవల జోరుగా ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ సినిమాని హిందీ చిత్రం 1964లో వచ్చిన 'వహ్ కౌన్ థీ' మిస్టరీ థ్రిల్లర్ ఆధారంగా రూపొందించనున్నట్లు తెలుస్తోంది. "జాక్వెలిన్ ఓ హారర్ చిత్రంలో ప్రధాన పాత్రలో నటించేందుకు అంగీకరించారు. ఈ సినిమాని భయానక వాతావరణంతో కూడిన ఓ చిన్న గ్రామంలో చిక్కుకున్న అమ్మాయి.. యటపడడానికి చేసే పోరాటాల చుట్టూ తిరిగే కథాంశంతో రూపొందనుంది. ఇందులో జాక్వెలిన్‌పై ప్రత్యేక యాక్షన్ ఘట్టాలను తెరకెక్కించనున్నారు. త్వరలోనే ఈ చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నార"ని జాక్వెలిన్ సన్నిహిత వర్గాల సమాచారం.



# ప్యారడైజ్.. ప్రత్యేక పాట సన్నాహాలు

కథానాయకుడు నాని.. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో రూపొందుతున్న చిత్రం 'ది ప్యారడైజ్'. 'దసరా' విజయం తర్వాత ఈ ఇద్దరి నుంచి వస్తున్న రెండో సినిమా ఇది. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ చిత్రం తాజాగా క్లైమాక్స్‌తో పాటు మొత్తం టాకీ పార్ట్‌ని పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు పాటల చిత్రీకరణకు సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా ప్రత్యేక గీతం కోసం హైదరాబాద్‌లో ఓ భారీ సెట్‌ని సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పాట కోసం కీర్తి సురేశ్ పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఇక మరోవైపు ఆగస్టు తొలి వారంలో ఓ చిన్న టీజర్‌తో విడుదల తేదీపై స్పష్టత ఇచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇది 1980ల నాటి సికింద్రాబాద్ నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్నట్లు తెలిసింది. నాని ఇందులో జడల్‌గా విభిన్నమైన పాత్రలో అలరించనున్నారు. మోహన్‌బాబు ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. కయాదు లోహర్ కథానాయిక. ప్రస్తుతం తుది దశలో ఉన్న ఈ చిత్రాన్ని సెప్టెంబరు నెలాఖరున తెరపైకి తీసుకు రానున్నట్లు ప్రచారం వినిపిస్తోంది.

# అభిమానులకు గుడ్ న్యూస్.. బూమ్ బూమ్ బుమ్రా ఫిట్



భారత క్రికెట్ అభిమానులకు శుభవార్త. జస్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్ విషయంలో నెలకొన్న సందిగ్ధత తొలగింది. శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు అతడిని ఎంపిక చేసినా.. ఫిట్‌నెస్ పరీక్షలో పాసైతేనే ఆడతాడని బీసీసీఐ సెలక్షన్ కమిటీ ముందే చెప్పింది. ఈ క్రమంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ తాజాగా తీపి కబురు అందించింది. జస్‌ప్రీత్ బుమ్రా ఫుల్ ఫిట్‌గా ఉన్నాడని స్పష్టం చేసింది. దీంతో శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌లో అతడు ఆడటం ఖాయమే.

"జస్‌ప్రీత్ బుమ్రా ( గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడు. ఫిట్‌నెస్ టెస్టులను క్లియర్ చేశాడు. ఇప్పటికే స్క్వాడ్‌లో ఉన్న అతడు.. రెండు టెస్టులకూ అందుబాటులో ఉంటాడు" అని బీసీసీఐ అధికారి వెల్లడించారు. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ సందర్భంగా బుమ్రా గాయం తిరగబెట్టిన సంగతి తెలిసిందే. దీంతో మూడో వన్డేలో బెంచ్‌కే పరిమితమయ్యాడు. అతడి లేని లోటు స్పష్టంగా కనిపించింది. పెద్దగా అనుభవం లేని భారత పేస్ ఎటాక్‌పై ఇంగ్లాండ్ బ్యాటర్లు విరుచుకుపడ్డారు. భారీ స్కోర్లు నమోదైన ఆ మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌నే విజయం వరించింది.

**శ్రీలంకతో టెస్టు సిరీస్ అత్యంత కీలకం..**

ఇప్పుడు శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో బుమ్రా ఆడటం భారత్‌కు అత్యంత కీలకం. ఇద్దరు ప్రధాన పేసర్లు మాత్రమే తుది జట్టులో ఉండే అవకాశం ఉంది. బుమ్రా ఉంటే ప్రత్యర్థి లంక బ్యాటర్లు హడలెత్తడం ఖాయం. అంతేకాకుండా.. గతంలో శ్రీలంక చేతిలో టీమ్ఇండియాకు ఓటమి ఎదురైంది. దీంతో ఆ జట్టుపై ప్రతీకారం తీర్చుకోవడంతోపాటు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకోవాలంటే ఈ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాల్సిన అవసరం ఉంది. నాలుగో డబ్ల్యూటీసీ సీజన్‌లో భారత్ ఇంకా తొమ్మిది టెస్టులను ఆడనుంది. ఇందులో కనీసం ఏడు మ్యాచుల్లో గెలిస్తేనే ఫైనల్‌కు చేరేందుకు ఛాన్స్ ఉంటుంది. ఆగస్టులో శ్రీలంకతో సిరీస్ తర్వాత న్యూజిలాండ్‌తో అక్కడి గడ్డపైనే భారత్ తలపడాలి. అందుకే, ఇక్కడి నుంచి ప్రతి మ్యాచ్ విజయమూ భారత్‌కు కీలకం.

# టాలెంట్ ఉంటే పీఆర్ అక్కర్లేదని రుజువు చేశావ్: రహానేకు హీరో ప్రశంసలు



టీమ్ఇండియా మాజీ ఆటగాడు అజింక్య రహానే పై బాలీవుడ్ నటుడు, '12th ఫెయిల్' హీరో విక్రాంత్ మాస్సే ప్రశంసల వర్షం కురిపించాడు. నిన్న రహానే క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. దీంతో అతడి సేవలను గుర్తు చేసుకుంటూ ఇప్పటికే పలువురు స్పందించారు. తాజాగా విక్రాంత్ సోషల్ మీడియా వేదికగా ఆసక్తికర పోస్టు పెట్టాడు. "అజింక్య రహానే (Ajinkya Rahane).. మీరు ఈ జెర్సీని ధరించడం వల్ల భారత క్రికెట్ మరింత గొప్పగా మారింది. కొందరు ఆటగాళ్లు రికార్డులను సృష్టిస్తారు. మరికొందరు ప్రమాణాలను నెలకొల్పుతారు. మీరు రెండో జాబితాకు చెందుతారు. వ్యక్తిగతం కంటే జట్టు కోసమే ఆడారు. విజయాలను వినయంతో.. ఎదురుదెబ్బలను ప్రశాంతంగా, హుందాతనంతో స్వీకరించారు. మీ ప్రతిభతోపాటు వ్యక్తిత్వం కూడా స్ఫూర్తిదాయకమని మాకు గుర్తు చేశారు. రాహుల్ ద్రవిడ్‌కు మీరే అసలైన వారసుడిగా నిలిచారు. క్రికెట్ ప్రపంచం మీకు రుణపడి ఉండటానికి అదొక్క విషయం చాలు. ప్రచార ఆర్భాటాలనే విలువలుగా భావించే ప్రస్తుత పరిస్థితుల్లో.. నిజమైన ప్రతిభకు పీఆర్ టీమ్ అవసరం లేదని నిరూపించారు. నిస్వార్థ సేవ, పట్టుదల, ఆటపట్ల మీకున్న అంకితభావం తరతరాలపాటు గుర్తుండిపోతుంది. ధన్యవాదాలు జింక్స్" అని విక్రాంత్ పోస్టు పెట్టాడు.

# సుదీర్ఘ ఫార్మాట్‌లో వైభవ్‌ను ఎలా వైస్ కెప్టెన్ చేశారు?: హర్షా భోగ్లే



దులీప్ ట్రోఫీ 2026-27 సీజన్ కోసం ఈస్ట్ జోన్ స్క్వాడ్‌ను ప్రకటించింది. అనూహ్యంగా వైభవ్ సూర్యవంశీ కి వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. సారథిగా ఇషాన్ కిషన్‌ను సెలక్టర్లు ఎంపిక చేశారు. ఇప్పుడిప్పుడే అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌ను ప్రారంభించిన వైభవ్‌ను డిప్యూటీ చేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆ నిర్ణయాన్ని స్వాగతించగా.. మరికొందరేమో సెలక్టర్లు తొందరపడ్డారని పేర్కొంటున్నారు. ఈ జాబితాలో క్రికెట్ వ్యాఖ్యాత హర్షా భోగ్లే కూడా చేరారు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అతడు నేర్చుకోవాల్సింది చాలా ఉందని.. వైస్ కెప్టెన్సీ అప్పగించడం సరైనదిగా అనిపించడం లేదని వెల్లడించారు. "రెడ్ బాల్ క్రికెట్‌లో.. అదీనూ సీనియర్లు ఉండే జట్టుకు వైభవ్ సూర్యవంశీని వైస్ కెప్టెన్‌గా ఎలా నియమించారనేది నాకు ఇప్పటికీ ఆశ్చర్యంగానే ఉంది. అతడు ఫస్ట్‌క్లాస్‌లో ఇప్పటి వరకు సుదీర్ఘ ఫార్మాట్‌లో కేవలం 12 ఇన్నింగ్స్‌లు మాత్రమే ఆడాడు. 17.25 సగటుతో 207 పరుగులు చేశాడు. నేను అతడి టాలెంట్‌ను తక్కువ చేయడం లేదు. అద్భుతమైన నైపుణ్యం కలిగిన ప్లేయర్. కానీ, అతడు నేర్చుకోవాల్సిన అంశాలు చాలానే ఉన్నాయి" అని హర్షా భోగ్లే పోస్టు పెట్టారు.

# బిడ్డకు జన్మనిచ్చిన 11 నెలలకే బరిలోకి.. డిస్కస్ త్రోలో సీమా కళిరామన్‌కు కాంస్యం

కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత అథ్లెట్ల పతకాల వేట కొనసాగుతోంది. మహిళల డిస్కస్ త్రో విభాగంలో సీమా కళిరామన్ కాంస్య పతకం సాధించింది. మూడో రౌండ్‌లో 58.65 మీటర్లు విసిరిన సీమా.. ఆ తర్వాత వరుసగా మూడుసార్లు ఫౌల్ అయింది. అయినా, కాంస్యం వరించింది. జమైకాకు చెందిన సమంత హాల్ (61.66 మీటర్లు), కెనడా అథ్లెట్ జులియా టంక్స్ (60.67 మీటర్లు) స్వర్ణ, రజత పతకాలను కైవసం చేసుకున్నారు. అయితే, కాంస్యం నెగ్గిన కళిరామన్ ప్రయాణం ప్రతి అథ్లెట్‌కు స్ఫూర్తిదాయకం..

**ఇటు అమ్మతనం.. అటు చదువుల తల్లి**

హరియాణాకు చెందిన 27 ఏళ్ల సీమా కేవలం అథ్లెట్ మాత్రమే కాదండోయ్.. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో పీహెచ్‌డీ చేసిన చదువుల తల్లి. చదువు, క్రీడలను బ్యాలెన్స్ చేసుకుంటూ వెళ్తుండగా.. ఈలోగా కొత్త పాత్ర పోషించాల్సి వచ్చింది. అమ్మగా మారిన ఆమె కేవలం 11 నెలల వ్యవధిలోనే డిస్కస్ త్రో పోటీలకు సిద్ధమైంది. ఆమెకు కోచింగ్ ఇచ్చింది మరెవరో కాదు.. ఆమె భర్త రవీందర్. జాతీయ స్థాయిలో డిస్కస్ త్రో మాజీ అథ్లెట్ అయిన రవీందర్.. మోను కళిరామన్‌గా సుపరిచితుడు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945